/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

అమరావతి | శుక్రవారం • 10-2-2023 • సంపుటి:7 • సంచిక:36 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

మాఘమాసం, శుక్రవారం, తిథి: పంచమి, ఉ.7.58 నుంచి రేపు ఉ.9.08 వరకు, నక్షత్రం: హస్త, పూర్తిగా, వర్జ్యం: ఉ.8.45-10.26 వరకు, దుర్ముహూర్తం: మ.12.07-12.53 వరకు, రాహుకాలం: ఉ.11.05-12.30 వరకు




## 'బార్డ్' ఎంత పనిచేసింది

గూగుల్‌కు 100 బిలియన్ డాలర్ల నష్టం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్‌కు భారీ షాక్ తగిలింది. చిన్న పొరపాటు కారణంగా బిలియన్ డాలర్లు కోల్పోవాల్సి వచ్చింది. ముఖ్యంగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన ..మిగతా 2లో

## న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు లేవు

కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం, నిబంధనల ప్రకారం న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు ..మిగతా 2లో

# మార్చిలో విశాఖకు షిఫ్టింగ్..!



చకచకా జరుగుతున్న ఏర్పాట్లు

సీఎం నివాసం, ఇతర భవనాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ఎప్పుడైనా ఉత్తర్వులు వెలువడే అవకాశం

ముందస్తు గ్రౌండ్ వర్క్ ప్రారంభం

మార్చి 22, 23న సీఎం గృహ ప్రవేశం?

అమరావతి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనను విశాఖకు తరలించబోతున్నారా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఉగాది నాటికి సీఎం విశాఖ నుంచి పాలన ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర పరిపాలన రాజధానిగా విశాఖపట్నం ఉండబోతుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పరిపాలనా రాజధానిని అమరావతి నుంచి వైజాగ్‌కు మార్చేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్లు సమాచారం. ఈ క్రమంలో ముఖ్యమంత్రి అధికారిక నివాస భవనంతో ఇతర భవనాల ఏర్పాటుకు విశాఖపట్నం జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఐతే రాష్ట్ర రాజధాని తరలింపుపై జిల్లా అధికారులకు ఇంకా అధికారిక ఉత్తర్వులు రానప్పటికీ, అధికారులు మాత్రం ముందస్తు గ్రౌండ్ వర్క్ ప్రారంభించినట్లు సమాచారం. దీంతో ఉత్తర్వులు ఎప్పుడైనా వెలువడే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విశాఖలో ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని బీచ్ రోడ్డులో ఖరారు చేసే అవకాశం ఉంది. అన్నీ కుదిరితే మార్చి 22 లేదా 23న ముఖ్యమంత్రి గృహప్రవేశం చేసే అవకాశం ఉందనే టాక్ జోరందుకుంది. అలాగే ఇతర అడ్మినిస్ట్రేసన్ బిల్డింగ్లను గుర్తించే పనిలో అధికార యంత్రంగం నిమగ్నమయ్యారు.

కాగా న్యూఢిల్లీలో జరిగిన సభలో జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం త్వరలో రాష్ట్ర రాజధాని అవుతుందని ప్రకటించిన విషయం తెలిసిందే. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్లో కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో భాగంగా.. 'రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజధానిగా మారబోతున్న విశాఖపట్నానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. నేను కూడా త్వరలో విశాఖపట్నంకు షిఫ్ట్ అవుతానని' సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. 2019లో జగన్ సర్కార్ ..మిగతా 2లో

# రాష్ట్రానికి తీవ్ర నష్టం



జగన్‌ను చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది

అమరావతి, పోలవరాన్ని దెబ్బతీశారు

లేని అధికారం ఆపాదించుకుంటున్నారు

రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు

జగన్ రెడ్డి మభ్యపెట్టడంలో దిట్ట, దోచుకోవడంలో అనకొండ

పెట్టుబడుల్ని తరిమేసి ఏం చేద్దామని విశాఖ వెళ్తున్నారు

విశాఖను గంజాయి రాజధానిగా మార్చారు..

సైకో వల్ల రాష్ట్రం నాశనం కావటానికి వీల్లేదు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

అమరావతి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): సీఎం జగన్, ఆ పార్టీ నేతల తీరు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి రెండుకళ్లు లాంటి అమరావతి, పోలవరంను దెబ్బతీశారని మండిపడ్డారు. ''రాష్ట్ర రాజధానిపై నిన్న కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసింది. శివరామకృష్ణ కమిటీ నివేదికను కేంద్రం సుప్రీంకోర్టులో ప్రస్తావించింది. శివరామకృష్ణ కమిటీ నివేదికను రాష్ట్రానికి పంపామని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఎంపిక చేసిందని కేంద్రం తెలిపింది. ఆ నిర్ణయాన్ని తాము ఆమోదించామని కేంద్రం చెప్పింది. ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం తమను సంప్రదించకుండానే 3 రాజధానుల చట్టం తెచ్చిందని కేంద్రం అఫిడవిట్‌లో స్పష్టంగా తెలిపింది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానంగానే కేంద్రం ఈ విషయాలు చెప్పింది. అధికారంలోకి రాకముందు తాడేపల్లిలో ఇల్లు కట్టుకుని జగన్ ఏం చెప్పారు. అమరావతే రాజధానిగా ఉంటుంది. అమరావతిని తెలుగుదేశం పార్టీ కంటే మిన్నగా అభివృద్ధి చేస్తామని చెప్పారా? లేదా? ప్రజా జీవితం అంటే మీ దృష్టిలో చులకనైపోయింది. మీ తీరు చూస్తూ ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. ఓట్ల కోసం ఎన్నో అబద్ధాలు చెప్పారు. చట్టానికి ఎన్ని తూట్లు పెట్టాలో అన్ని పెట్టి మీ ..మిగతా 2లో



## తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్..

పనులు మొదలు పెట్టనున్న రైల్వే శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం ముంబైలోని విక్రోలి ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ ప్రారంభించిన భూసేకరణకు వ్యతిరేకంగా గోద్రేజ్ అండ్ ..మిగతా 2లో



# 60 ఏళ్లలో కాంగ్రెస్ దేశాన్ని నాశనం చేసింది

గరీబీ హఠావో కేవలం నినాదమే..

ఎన్టీఆర్, ఎంజీఆర్ లాంటి దిగ్గజాల ప్రభుత్వాలను పడగొట్టారు

600లకు పైగా పథకాలకు గాంధీ, నెహ్రూ పేర్లే

విపక్షాల ప్రవర్తన బాధాకరం..

విపక్షాలు విసిరే బురదలోనూ 'కమలం' వికసిస్తుంది

రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రాష్ట్రపతి ప్రసంగంపై ప్రధాని నరేంద్రమోదీ రాజ్యసభలో ధన్యవాద తీర్మానానికి సమాధానం ఇస్తూ మరోసారి కాంగ్రెస్ పార్టీని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రధాని ప్రసంగం సమయంలో ప్రతిపక్షాలు మోదీ-అదానీ భాయ్ భాయ్ అని నినాదాలు చేస్తున్నా పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టారు. బుధవారం లోక్‌సభలో సమాధానం ఇచ్చిన ఆయన, గురువారం రాజ్యసభలో కూడా కాంగ్రెస్ తీరును తప్పుపట్టారు. 'విపక్షాల తీరు చూస్తుంటే బాధేస్తోంది. ఇలాంటి ముఖ్యమైన సభలో నినాదాలు ..మిగతా 2లో



## 17వేలు దాటిన మరణాలు

తుర్కియేలో 1100 సార్లు ప్రకంపనలు..

భూకంప ధాటికి..

దేశమే 5 మీటర్లు జరిగింది..!

2



## 'సుప్రీం'కు చేరిన 'అదానీ' వ్యవహారం

దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది

నేడు విచారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: అదానీ గ్రూప్ సంస్థలపై హిండెన్‌బర్గ్ నివేదిక దేశంలో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ వ్యవహారంపై ..మిగతా 2లో

# మెరుగైన పనితీరు కనబర్చాలి



ఆదాయార్జన శాఖలపై సీఎం జగన్ సమీక్ష

ఆదాయాలు లక్ష్యాలకు దగ్గరగా ఉన్నాయి

సీఎంకు వెల్లడించిన అధికారులు 6




2

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

ఏపీలో 3 పట్టభద్రులు, 2 ఉపాధ్యాయ, 8 స్థానిక సంస్థల స్థానాలు

తెలంగాణలోని హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌గర్ ఉపాధ్యాయ స్థానంతో పాటు హైదరాబాద్ స్థానిక సంస్థల స్థానంలో ఈసీ ఎన్నికలు



## ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే కాదు..!

ఇకపై ఆ రోజును అలా జరుపుకోండి..

2

కేంద్రం కొత్త ఉత్తర్వులు..

వాలెంటైన్స్ డే కాకుండా కౌ హగ్ డేగా ఓ ప్రత్యేకమైన వేడుకను నిర్వహించనున్నారు

**మంచిమాట**

అతి నిద్ర, బద్ధకం, భయం, కోపం, నిరాశావాదం- ఈ ఐదూ అతి చెడ్డ గుణాలు. వీటిని పొరపాటున దగ్గరకు రానిచ్చినా జీవితంలో పైకి రావడం, సుఖపడడం జరగదు.

**శుభోదయం**



# వాస్తవ పెట్టుబడుల కోసమే మా ప్రయత్నం..

7

# అప్పర్ భద్ర ప్రాజెక్టు రాయలసీమకు ఉరితాడు

సాగునీటి ప్రాజెక్టుల్లో సీమకు అన్యాయం

ఇది ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం డిమాండ్‌కు దారితీస్తుంది

సిద్ధేశ్వరం కోసం ఈ నెల 25 నుంచి పాదయాత్ర

బీజేపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

2





## చంద్రబాబును ఉరితీయాలి..!

వైసీపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు..

అమరావతి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై సంచలన వ్యాఖ్యలు వేశారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ..మిగతా 2లో

## న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు లేవు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించడం లేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ, జడ్జీలుగా నియమించే సమయంలో ప్రాతినిధ్యం లేని వర్గాలను దృష్టిలో ఉంచుకొని సిఫార్సు చేయాలని జడ్జీలు, కొలీజియంకు సూచించినట్లు తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటులో వెల్లడించారు. న్యాయమూర్తుల నియామకంలో రిజర్వేషన్లు కల్పించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందా..? అని డీఎంకే నేత తిరుచ్చి శివ రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగారు. దీనికి బదులిచ్చిన కేంద్ర న్యాయశాఖ మంత్రి .. 'ప్రస్తుతం అనుసరిస్తోన్న విధానం, నిబంధనల ప్రకారం న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు లేవు. అయినప్పటికీ, న్యాయమూర్తులుగా పేర్లను సిఫార్సు చేసేటప్పుడు వెనకబడిన తరగతులు, మహిళలతో పాటు న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యం లేని వర్గాల వారి పేర్లను పొందుపరచాలని జడ్జీలకు, ముఖ్యంగా కొలీజియం సభ్యులకు గుర్తుచేశాను' అని వెల్లడించారు. ఇక గుజరాత్‌లో పెండింగు కేసులకు సంబంధించి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 14.47లక్షల కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. న్యాయ సహాయం అభ్యర్థించే వారికోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నియమించే లాయర్ల సంఖ్యను పెంచాలని సభ్యులు అడిగిన ప్రశ్నకూ కేంద్ర మంత్రి స్పందించారు. ఇందుకోసం ఇప్పటికే ఎన్ఎల్ఎస్ఏతో పాటు రాష్ట్రస్థాయిలో ఎస్ఎల్ఎస్ఏ, జిల్లా స్థాయిలో డీఎల్ఎస్ఏ, తాలూకా స్థాయిలోనూ ఉచితంగా న్యాయ సేవలు అందుతున్నాయని చెప్పారు.

## 'బార్డ్' ఎంత పనిచేసింది..

(మొదటిపేజీ తరువాయి)

చాట్‌బోట్ చాట్‌జీపీటీకి పోటీగా బార్డ్‌ను రంగంలోకి దింపిన గూగుల్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఇటీవల ప్రకటించిన చాట్‌బోట్ బార్డ్‌కు సంబంధించిన ఒక ప్రకటనలో భారీ తప్పిదం చోటు చేసుకుంది. ఈ కారణంగా గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేర్ ధర బుధవారం 8 శాతం కుప్పకూలింది. ఫలితంగా గూగుల్ ఒక్క రోజులోనే ఏకంగా 100 బిలియన్ డాలర్ల (దాదాపు 8 లక్షల 26 వేల కోట్లు) మేర మార్కెట్ విలువను కోల్పోయింది.

**అసలేం జరిగింది..**

సౌరవ్యవస్థ వెలుపలి గ్రహాల చిత్రాలను తొలిసారిగా ఏ శాటిలైట్ తీసిందన్న ప్రశ్నకు బార్డ్ సరైన సమాధానం ఇవ్వడంలో తప్పులో కాలేసింది. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ అని సమాధానం చెప్పింది. కానీ నాసా ధృవీకరించినట్లుగా, 2004లో యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీకి చెందిన టెలిస్కోప్ ఈ చిత్రాలను తీసింది. బార్డ్‌కు సంబంధించి గూగుల్ ట్విట్టర్లో పోస్ట్ చేసిన చిన్న వీడియోలో ఈ పొరపాటు దొర్లింది. మరోవైపు మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీతో దూసుకు రావడంతో గూగుల్ బార్డ్ వైపు ప్రతి ఒక్కరూ చాలా ఉత్సాహంగా ఉన్నారని, ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, మార్కెట్ గూగుల్‌కు భారీ శిక్ష విధించిందని ట్రిపుల్ డి ట్రేడింగ్ మార్కెట్ నిర్మాణ విశ్లేషకుడు డెన్నిస్ డిక్ వ్యాఖ్యానించారు.

## తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్..

(మొదటిపేజీ తరువాయి)

బోయ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ ప్రాజెక్టులు జాతీయ ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని, ప్రజా సంక్షేమం కోసమేనని కోర్టు పేర్కొంది. జస్టిస్ ఆర్డీ ధనుక, జస్టిస్ ఎంఎం సత్తయేలతో కూడిన డివిజన్ బెంచ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకమైనదని, ప్రైవేట్ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపింది. ఇక హైకోర్టు తీర్పుతో బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయ్యింది. దీంతో ప్రాజెక్టు పనులు ప్రారంభించనుంది రైల్వే శాఖ. అయితే ముంబై-అహ్మదాబాద్ మధ్య మొత్తం 508.17 కి.మీ రైలు మార్గంలో 21 కి.మీ భూగర్భంలో ఉంటుంది. భూగర్భ సొరంగం ప్రవేశ స్థానం విక్రోలిలోని గోద్రెజ్ భూమిపై వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ కారణంగా మొత్తం ప్రాజెక్ట్ ఆలస్యం అవుతోందని, అయితే ప్రాజెక్ట్ ప్రజలకు ముఖ్యమైనదని పేర్కొంది. గోద్రెజ్ అండ్ బోయ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్‌లోని విఖ్రోలి ప్రాంతంలో ఉన్న ప్రాంతం మినహా మొత్తం ప్రాజెక్టు రూట్‌కు సంబంధించిన సేకరణ ప్రక్రియ పూర్తయిందని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది.

**ప్రభుత్వం ఇప్పటికే నష్టపరిహారం ఇచ్చింది**

గత ఏడాది అక్టోబర్‌లో కంపెనీకి రూ.264 కోట్ల పరిహారం చెల్లించామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోర్టుకు తెలిపింది. తనకు పరిహారం చెల్లించాలని మహారాష్ట్ర ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 15న జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ గోద్రెజ్ అండ్ బోయ్స్ పిటిషన్ దాఖలు చేసింది.

## సుప్రీంకు చేరిన 'అదానీ' వ్యవహారం..

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని లేదా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని గత కొన్ని రోజులుగా పార్లమెంట్లో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. అదానీ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టనుంది. అదానీ గ్రూప్‌పై హిండెన్బర్గ్ ఇచ్చిన నివేదికపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసర విచారణ చేపట్టాలని సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ధర్మాసనం ముందు అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. దీనిపై శుక్రవారం (ఫిబ్రవరి 10న) విచారణ జరుపుతామని తెలిపింది. దీనిపై గతవారం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదానీ గ్రూప్‌పై సంచలన నివేదిక ఇచ్చి ఆ సంస్థ మార్కెట్ విలువ పతనానికి కారణమైన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ యజమాని నాథన్ అండర్సర్, అతడి అనుచరులపై దర్యాప్తునకు ఆదేశించాలని సీనియర్ న్యాయవాది ఎంఎల్ శర్మ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కూడా రేపు సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. అదానీ గ్రూప్ తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని, ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందంటూ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక తీవ్ర దుమారానికి దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా ఖండించింది. కాగా.. ఈ నివేదిక నేపథ్యంలో ఇటీవల అదానీ సంస్థకు చెందిన కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి.

## మార్చిలో విశాఖకు షిఫ్టింగ్..!

(మొదటిపేజీ తరువాయి)

మూడు రాజధానుల ఆలోచనను రూపొందించింది. విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, అమరావతి శాసనసభ రాజధానిగా ఉండబోతుందనే ప్రతిపాదన తీసుకొచ్చింది. ఐతే రాజధాని తరలింపుపై 33 వేల ఎకరాల భూమిని ఇచ్చిన అమరావతి రైతుల నిరసనల దృష్ట్యా రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఆరు నెలల్లో అభివృద్ధి చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిని సవాళ్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా.. హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.

# రాష్ట్రానికి తీవ్ర నష్టం..

(మొదటిపేజీ తరువాయి)

ఇష్ట ప్రకారం చేశారు. అధికారం లేదని తెలిసినా? రాజధానిపై చట్టం చేసే హక్కు శాసనసభకు లేదా? అని మాట్లాడారు. రాజధానిపై చట్టం చేయడానికి వీల్లేదని హైకోర్టు కూడా స్పష్టం చేసింది. ఏపీ పునర్విభజన చట్టం పార్లమెంట్ చేసింది. అందులో రాజధాని ఏ విధంగా చేయాలో స్పష్టంగా పేర్కొన్నారు. దాని ప్రకారం అమరావతి రాజధాని వచ్చింది.. రాష్ట్ర ప్రభుత్వానికి రాజధాని చట్టం చేసే హక్కులేదని న్యాయస్థానం చెప్పింది. దాన్ని వక్రీకరించి.. శాసనసభకు చట్టాలు చేసే అధికారం లేదా? అని ఇష్టానుసారం మాట్లాడారు. విభజన చట్టం సెక్షన్5లో రాజధానిపై స్పష్టంగా ఉన్నా 3 రాజధానులపై శాసనసభలో బిల్లు పాస్ చేశారు. కౌన్సిల్లో నానా దుర్భాషలాడారు. 3 రాజధానుల బిల్లును కౌన్సిల్ సెలెక్ట్ కమిటీకి పంపిస్తే.. కౌన్సిల్ రద్దుకు తీర్మానం చేశారు. ఆ తర్వాత కొంతకాలానికి కౌన్సిల్ రద్దు తీర్మానాన్ని ఉపసంహరించుకున్నారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమి స్వచ్ఛందంగా ఇచ్చారు. అమరావతి రాజధానిపై రూ.11,395 కోట్లు ఖర్చు పెడితే.. జగన్ ప్రభుత్వం అమరావతిపై విషం చిమ్మింది. రాజధాని రైతులు న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తే ఎన్ని ఇబ్బందులు పెట్టాలో అన్ని ఇబ్బందులు పెట్టారు. లేని అధికారం ఆపాదించుకుని జగన్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు'' అని చంద్రబాబు విమర్శించారు.

**సైకో వల్ల రాష్ట్రం నాశనం కావటానికి వీల్లేదు..**

ఒక సైకో వల్ల రాష్ట్రం నాశనం కావటానికి వీల్లేదని చంద్రబాబు తేల్చి చెప్పారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన జగన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతిపై వైసీపీ నేతలు చేసిన ఆరోపణలన్నీ అసత్యాలని తేలిందన్నారు. అమరావతి నిర్మాణం ముందుకు సాగి ఉంటే పన్నుల రూపేణా రాష్ట్రమంతటికీ ఆదాయం వచ్చి ఉండేదని పేర్కొన్నారు. ప్రజావేదికతో ప్రారంభమైన అమరావతి విధ్వంసం ఇప్పుడు రోడ్లు తవ్వేసే దాకా వచ్చిందని విమర్శించారు. జగన్ రెడ్డి మభ్యపెట్టడంలో దిట్ట, దోచుకోవటంలో అనకొండ అని ధ్వజమెత్తారు. పెట్టుబడులన్నీ తరిమేసి ఏం ఒరగబెట్టడానికి విశాఖ వెళ్తున్నానని జగన్ చెబుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రూ.45వేల కోట్లు కాజేసి, గంజాయి రాజధానిగా విశాఖను మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని నిర్వీర్యం చేసి గోదావరిలో ముంచేశారని దుయ్యబట్టారు. రుషికొండకు కూడా బోడి గుండు కొట్టించిన ఘనుడు జగన్ అని విమర్శించారు. విభజన చట్టం వల్ల ఏపీకి జరిగిన నష్టం కంటే జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జరిగిన నష్టమే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. విధ్వంసకర చర్యల వల్ల మళ్లీ కోలుకోలేని విధంగా రాష్ట్రాన్ని చేశారని ఆక్షేపించారు. రోజు గడిస్తే చాలన్నట్టు వైసీపీ ఎమ్మెల్యేలు బానిసల్లా బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాక్షేత్రంలో జగన్ రెడ్డిని దోషిగా నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. సైకో చేతిలో రాష్ట్ర రాజధాని పేరిట వివిధ సందర్భాల్లో అమరావతి పై జగన్ చేసిన ప్రసంగాల వీడియోను మీడియా సమావేశంలో చంద్రబాబు ప్రదర్శించారు.

# 60 ఏళ్లలో కాంగ్రెస్ దేశాన్ని నాశనం చేసింది

(మొదటిపేజీ తరువాయి)

చేయడం దురదృష్టకరం. ప్రజా సమస్యలపై చర్చించాలన్న ఆలోచన వారికి లేదు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన కీలక సభలో ఇలా ప్రవర్తిస్తారా? మీరు విసిరే బురదలో కూడా 'కమలం' (బీజేపీ ఎన్నికల గుర్తు) వికసిస్తుంది'' అన్నారు. కాంగ్రెస్ పాలనను దగ్గర నుంచి చూశా అని, ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలన అంతా శుద్ధ దండగ అని, ఇతర దేశాలు అభివృద్ధి చెందుతుంటే కాంగ్రెస్ భారత దేశాన్ని నాశనం చేసిందని విమర్శించారు. దేశప్రజలు కాంగ్రెస్ పార్టీని నిరాకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో గరీబీ హఠావో కేవలం నినాదమే అని, మధ్యవర్తుల చేతుల్లోకి డబ్బులు వెళ్లేవని తెలిపారు. దేశ ప్రజలను కాంగ్రెస్ వంచించిందని.. నేను ఎప్పుడూ రాజకీయాలను లబ్ధి కోసం చూడలేదని ఆయన వెల్లడించారు. పేదలను బ్యాంకింగ్ వ్యవస్థలో భాగం చేశామని తెలిపారు. దశాబ్దాలుగా ఆదివాసీలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని.. బడ్జెట్‌లో మా ప్రభుత్వం లక్షా 20 వేల కోట్లను గిరిజనుల కోసం కేటాయించామని పేర్కొన్నారు. 13 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని అన్నారు. గత 3-4 ఏళ్లలో 11 కోట్ల ఇళ్లకు కుళాయి నీటి కనెక్షన్లు ఇచ్చామని.. జన్ ధన్ ఖతా ఉద్యమాన్ని ప్రారంభించి.. గత 9 ఏళ్లలో 48 కోట్ల జన్ ధన్ ఖాతాలను తెరిచామని సభలో పీఎం మోదీ చెప్పారు. కర్ణాటక కలబురిగిలో 8 లక్షల ఖాతాలతో సహా కర్ణాటకలో 1.70 కోట్ల జన్ ధన్ ఖాతాలను ప్రారంభించామని దీన్ని మల్లిఖార్జున ఖర్గే చూడాలని సూచించారు. ఒకరి ఖాతా మూసేయబడుతోంది.. వారి బాధను అర్థం చేసుకోగలను అంటూ కాంగ్రెస్‌పై సెటైర్లు వేశారు. దేశంలోని 25 కోట్ల కుటుంబాలకు ఎల్పీజీ కనెక్షన్లను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. నిజమైన లౌకికవాదం వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులందరికీ చేరేలా చూస్తోందని తెలిపారు. దేశంలో 110 వెనకబడిన జిల్లాలను గుర్తించి ఆ జిల్లాల్లో విద్యా, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరిచామని వెల్లడించారు. ''ఏదో గాలివాటంలా కాకుండా.. మేం కష్టపడి పనిచేసి శాస్త్ర సాంకేతికత ద్వారా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నాం. కొవిడ్ కష్టకాలంలో టీకాలు అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలపైనా కొందరు నేతలు దుష్ప్రచారం చేసే ప్రయత్నం చేశారు. మన శాస్త్రవేత్తలు రూపొందించిన టీకాలే 150 దేశాల ప్రజలను కాపాడాయి. ప్రతిపక్షాలు సైన్స్‌కు, టెక్నాలజీకి వ్యతిరేకం.. దేశం గురించి వారికేం బాధలేదు.. ఎప్పుడూ రాజకీయాలే చేస్తారు. ప్రభుత్వం విధానాలను సవరించడం ద్వారా డ్రోన్ల వాడకం సామాన్యులకు ప్రయోజనం చేకూరుస్తోంది. విపక్షాలు అర్ధసత్యాలతో కొత్త కథలు సృష్టించడం ద్వారా అసత్యాలను వ్యాప్తి చేస్తున్నాయి. రక్షణ రంగంలో భారత్ ఎగుమతులు ప్రస్తుతం రూ.లక్ష కోట్లకు పైనే ఉన్నాయి. దేశం ఆత్మనిర్భరత సాధించే దిశగా ఈ విభాగంలో కొత్త కంపెనీలు ప్రవేశిస్తున్నాయి'' అని ప్రధాని అన్నారు.

**ప్రభుత్వాలను పడగొట్టారు..**

''కాంగ్రెస్ పాలకులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేశారు. ఇందిరా గాంధీ 50 సార్లకు పైగా ఆర్టికల్ 356ను ప్రయోగించి ప్రభుత్వాలను పడగొట్టారు. ఎన్టీఆర్ చికిత్స కోసం అమెరికా వెళ్తే ఆయన ప్రభుత్వాన్ని పడగొట్టారు. ఎంజీఆర్ వంటి దిగ్గజాల ప్రభుత్వాలను కాంగ్రెస్ అక్రమంగా పడగొట్టింది. కాంగ్రెస్ పాలకులు 600లకు పైగా పథకాలకు గాంధీ, నెహ్రూ పేర్లు పెట్టారు (ఓ పత్రిక కథనాన్ని ఉటంకిస్తూ..). గాంధీ పేరు ఉన్న నేతలు తమ ఇంటి పేరులో నెహ్రూ అని ఎందుకు పెట్టుకోలేదు?'' అని మోదీ ప్రశ్నించారు. మరోవైపు, విపక్ష సభ్యుల ఆందోళనతో రాజ్యసభలో గందరగోళం నెలకొంది. వెల్లోకి దూసుకొచ్చిన పలువురు ఎంపీలు నిరసన తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ గ్రూప్ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయాలని, దర్యాప్తు జరిపించాలంటూ నినాదాలు చేశారు. వారి నినాదాల మధ్యే ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

# 17వేలు దాటిన మరణాలు

అంకారా, ఫిబ్రవరి 9: ప్రకృతి సృష్టించిన ఘోర విపత్తుతో కకావికలమైన తుర్కియే, సిరియాలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఎటు చూసినా శిథిలాల గుట్టలు.. శవాల దిబ్బలే కన్పిస్తున్నాయి. నిమిష నిమిషానికి బయట పడుతున్న వందలాది మృతదేహాలు హృదయాలను మెలిపెడుతున్నాయి. ఈ భూప్రళయం కారణంగా ఇరు దేశాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 17వేలు దాటింది. తుర్కియేలో ఇప్పటివరకు 14,014 మంది ప్రకృతి ప్రకోపానికి బలైనట్లు దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ తెలిపారు. గురువారం ఆయన గాంజియాతెప్ ప్రాంతంలోని భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇక, పొరుగున ఉన్న సిరియాలో మరో 3,162 మంది మృతిచెందారు. దీంతో ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 17,176కు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద ఇంకా లక్షలాది మంది చిక్కుకుపోయారు. వారి సంఖ్య కచ్చితంగా తెలియనప్పటికీ.. పరిస్థితి మాత్రం అత్యంత విషమంగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సమయం గడుస్తున్న కొద్దీ మరణాల సంఖ్య ఇంకా పెరగొచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బలగాలు కాలంతో పోటీపడి సహాయక చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ.. వరుసగా వస్తున్న ప్రకంపనలు, వాతావరణ పరిస్థితులు ఆటంకం కలిగిస్తున్నాయి.

**1117 సార్లు కంపించిన భూమి..**

గత సోమవారం 7.8 తీవ్రతతో భూకంపం సంభవించిన తర్వాత నుంచి అనేక సార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. తుర్కియేలో ఇప్పటివరకు 1117 సార్లు భూమి కంపించినట్లు తుర్కియే విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. వరుస ప్రకంపనలతో బలహీనంగా ఉన్న భవనాలు కూలిపోతున్నాయి. దీంతో ప్రమాద తీవ్రత పెరగడంతో పాటు సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు.

**పిల్లల దుస్తులను కాల్చుతూ..**

భూకంపం ధాటికి సర్వం కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గడ్డకట్టే చలిలో వారంతా ఇప్పుడు తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చలిని తట్టుకునేందుకు వెచ్చదనం కోసం పార్కుల్లోని బెంచీలు, పిల్లల దుస్తులను కాల్చేస్తున్నారు. ఇలాంటి హృదయ విదారక దృశ్యాలెన్నో కన్పిస్తున్నాయి. ఈ విషాదానికి అంతమెక్కడో తెలియక తుర్కియే వాసులు క్షణక్షణం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

**5 మీటర్లు జరిగిన తుర్కియే..**

అత్యంత శక్తిమంతమైన భూకంపం ధాటికి తుర్కియే దేశం ఐదు నుంచి ఆరు మీటర్ల మేర పక్కకు కదిలినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తుర్కియే ఉన్న టెక్టానిక్ ప్లేట్స్ (భూమి పైపొరలోని ఫలకాలు) మధ్య రాపిడి కారణంగా ఈ కదలిక జరిగినట్లు తెలిపారు. తమ అంచనా ప్రకారం.. ఈ భూకంప తీవ్రతతో సిరియాతో పోలిస్తే తుర్కియే 5-6 మీటర్ల పక్కకు జరిగినట్లు ఇటలీకి చెందిన సీస్మాలజిస్ట్ ప్రొఫెసర్ కార్లో డగ్లియాని వెల్లడించారు. తుర్కియే భూభాగం కింద ఉన్న అనతోలియా, అరేబియా, యూరోషియా, ఆఫ్రికా భూఫలకాలు నిరంతరం ఒకదానితో ఒకటి ఢీకొనడంతో 7.8, 7.2 తీవ్రతతో వరుసగా రెండు సార్లు శక్తిమంతమైన భూకంపాలు సంభవించినట్లు ఆయన తెలిపారు.

# భారత్‌పై ఆంక్షలు విధించబోం..

### రష్యా చమురు కొనుగోలుపై అమెరికా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రష్యా నుంచి చమురు దిగుమతుల్ని భారత్ గణనీయంగా పెంచుకుంటోంది. ఈ విషయంలో పాశ్చాత్య దేశాల ఒత్తిళ్లకు ఏమాత్రం తలొగ్గకుండా వ్యవహరిస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో ఆయా దేశాలు రష్యా చమురుపై విధించిన ఆంక్షల్ని భారత్ అవకాశంగా మార్చుకుంది. పలు దేశాల నుంచి వ్యక్తమైన విమర్శలకు స్వతంత్ర విదేశాంగ విధానంతో గట్టిగా బదులిస్తోంది. తాజాగా అమెరికా ఈ వ్యవహారంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

**ఇబ్బందేమీ లేదు..**

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అగ్రరాజ్యం స్పష్టం చేసింది. భారత్‌పై ఆంక్షలు విధించే ఆలోచనేమీ లేదని తేల్చి చెప్పింది. ఈ విషయాన్ని ఆ దేశ విదేశాంగ శాఖలో ఐరోపా, యురేషియా వ్యవహారాలను పర్యవేక్షించే అసిస్టెంట్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ కరెన్ బుధవారం విలేకరులతో చెప్పారు. భారత్- అమెరికా మధ్య సంబంధాలు చాలా బలమైనవని తెలిపారు. ఉక్రెయిన్ ప్రజలకు భారత్ అందిస్తున్న మానవతా సాయాన్ని ఆయన కొనియాడారు. ఇది యుద్ధాలకు సమయం కాదని.. చర్చలు, దౌత్యం ద్వారా సమస్యల్ని పరిష్కరించుకోవాలన్న ప్రధాని మోదీ హితవును సైతం స్వాగతిస్తున్నామన్నారు.

**అందుకే ఆంక్షలు విధించబోం..**

మాస్కో నుంచి న్యూఢిల్లీ చమురు కొనుగోళ్లపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఈ దశాబ్దం చివరికల్లా రష్యా చమురు, గ్యాస్ 50 శాతానికి తగ్గిపోతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలపై ప్రత్యేక ఆంక్షల వల్ల అంతర్జాతీయంగా పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చునని తెలిపారు. అందుకే రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. రష్యా చమురుపై విధించిన ఆంక్షల ఫలితం ఇప్పటికే కనిపిస్తోందన్నారు. ఆ దేశ బడ్జెట్‌లో లోటు ద్వారా ఈ విషయం స్పష్టమవుతోందన్నారు.

**రష్యా నుంచే 28 శాతం..**

రష్యా నుంచి మన దేశానికి ముడిచమురు దిగుమతులు అంతకంతకూ పెరుగుతున్నాయి. జనవరి నెలలో ఎప్పుడూ లేని స్థాయికి చేరాయి. ఒకప్పుడు ఒక శాతం కూడా లేని దిగుమతులు ఇప్పుడు ఏకంగా 28 శాతానికి చేరినట్లు ఎనర్జీ కార్గో ట్రాకర్ వోర్టెక్సా ఇటీవల వెల్లడించింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు ముందు రష్యా నుంచి మన క్రూడాయిల్ దిగుమతులు కేవలం 0.2 శాతం మాత్రమే. ఉక్రెయిన్‌పై దాడి తర్వాత పశ్చిమ దేశాలు ఆ దేశంపై ఆంక్షలు విధించాయి. దీంతో ఆదాయం కోసం ముడి చమురును రాయితీ ధరకే ఆ దేశం అందిస్తోంది. దీంతో చైనా, భారత్ ఆ దేశం నుంచి తక్కువ ధరకే ముడిచమురును దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో రష్యా ముడి చమురు వాటా 28 శాతానికి చేరింది. డిసెంబర్లో ఈ వాటా 26 శాతంగా ఉంది. రష్యా తర్వాత ఇరాక్ (20 శాతం), సౌదీ అరేబియా (17 శాతం), అమెరికా (9 శాతం), యూఏఈ (8 శాతం) అత్యధికంగా మన దేశానికి చమురును సరఫరా చేస్తున్నాయి.

# ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే కాదు..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ప్రేమికుల రోజును కౌ హగ్ డేగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. జాతీయ కామధేను ఆయోగ్ మాజీ ఛైర్మన్ డా.వల్లభ్ కతీరియా, అతని స్నేహితుల బృందం ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవానికి బదులుగా కౌ హగ్ డేని జరుపుకుంటారు. యువత ఆర్య సంస్కృతిని మరచి పాశ్చాత్య సంస ృతిని గుడ్డిగా అనుకరిస్తున్నారని అన్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరి 14ని కౌ హగ్ డేగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేసింది. వాలెంటైన్స్ డే అయిన 14వ తేదీన కౌ హగ్ డే జరుపుకోవాలని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ విడుదల చేసింది. అందుకే దేశవ్యాప్తంగా వాలెంటైన్స్ డే కాకుండా కౌ హగ్ డేగా ఓ ప్రత్యేకమైన వేడుకను నిర్వహించనున్నారు. జాతీయ కామధేను ఆయోగ్ మాజీ ఛైర్మన్ డా. ఆర్య సంస్కృతిని మరిచి పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరిస్తున్నామని వల్లభ్ కతీరియా అన్నారు. యూరప్, అమెరికాలో గోమాత నుండి సానుకూల శక్తిని పొందడానికి ప్రజలు ఆవు కౌగిలికి రూ.5200 చెల్లిస్తారు. ఆవు సంస్క ృతి, ఆవుల ఔషధ ప్రయోజనాల పట్ల భారతదేశ భవిష్యత్తు తరాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఆవు హగ్గింగ్ డే అనే ప్రత్యేకమైన భావనతో వాలెంటైన్స్ డే జరుపుకుంటారు. ముఖ్యంగా ఆవు ప్రేమికులకు విజ్ఞప్తి చేసేది ఏంటంటే.. ప్రజలు ఫిబ్రవరి 14న అన్ని గో శాలతో సహా అన్ని ప్రదేశాలలో గోమాతను ఆలింగనం చేసుకోవడం కనిపిస్తుంది. గోశాలకు వచ్చినప్పుడు ప్రజలు ఆవులను ఆలింగనం చేసుకోవటం, మరికొందరు యువకులు ఆవులతో సెల్ఫీలు కూడా దిగుతున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో మోగిన ఎన్నికలకు నగారా..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. త్వరలో ఖాళీ కానున్న స్థానాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీ, తెలంగాణలోని ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల్లో ఖాళీ అవనున్న స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో 3 పట్టభద్రులు, 2ఉపాధ్యాయ, 8 స్థానిక సంస్థల స్థానాలు (మొత్తం13), తెలంగాణలో ఒక్కో ఉపాధ్యాయ, స్థానిక సంస్థల స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది.

**ఏపీ, తెలంగాణలో ఎన్నికలు జరగనున్న స్థానాలివే..**

ఏపీలోని ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపురం-కర్నూలు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం పట్టభద్రుల స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. దీనితో పాటు ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ స్థానాల్లో ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది. అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాల్లోనూ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలోని హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌గర్ ఉపాధ్యాయ స్థానంతో పాటు హైదరాబాద్ స్థానిక సంస్థల స్థానంలో ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది.

**ముఖ్యమైన తేదీలు..**

నోటిఫికేషన్- ఫిబ్రవరి 16
నామినేషన్లకు చివరి తేదీ- ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన- ఫిబ్రవరి 24
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ- ఫిబ్రవరి 27
ఎన్నికల పోలింగ్ -మార్చి 13
ఓట్ల లెక్కింపు- మార్చి 16

## చంద్రబాబును ఉరితీయాలి..!

(మొదటిపేజీ తరువాయి)

చెందిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తాకట్టు పెట్టిన చంద్రబాబును ఉరితీయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చగా మారాయి. అనంతపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. చంద్రబాబు హయాంలోనే కర్ణాటక అక్రమ ప్రాజెక్టులకు పునాది పడిందని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ఏపీలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని.. కర్ణాటక అక్రమ ప్రాజెక్టులకు చంద్రబాబు ఏనాడూ అభ్యంతరం చెప్పలేదని ఆరోపించారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచినా చంద్రబాబు నోరు మెదపలేదు.. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు నీటి కేటాయింపునకు 2011లోనే కోర్టు స్టే ఇచ్చిందని.. 2017లో ఫారెస్ట్ క్లియరెన్స్, రెండో విడత అప్పర్ భద్ర ప్రాజెక్టుకు అనుమతులు వచ్చాయని.. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏమాత్రం అభ్యంతరం చెప్పలేదని ఆరోపించారు. అయితే, అప్పర్ భద్ర ప్రాజెక్టుపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అభ్యంతరాలు చెబుతూనే ఉందని గుర్తుచేశారు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి.. అప్పర్ భద్రపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ పోరాటం చేస్తోందన్న ఆయన.. ప్రాజెక్టు ఆపేందుకు సుప్రీంకోర్టులో వైఎస్ జగన్ సర్కారు బలమైన వాదనలు వినిపిస్తోందని తెలిపారు.. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తాకట్టు పెట్టిన చంద్రబాబును ఉరితీయాలంటూ సంచనల వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి. కాగా, గతంలోనూ చంద్రబాబుపై హాట్ కామెంట్లు చేశారు తోపుదుర్తి.. జాకీ పరిశ్రమ విషయంలో టీడీపీ మండిపడిన విషయం విదితమే కాగా.. ఇక, తనను, లోకేష్‌ను చంపేస్తారట అంటూ మాట్లాడిన చంద్రబాబు మాటలకు గతంలో కౌంటర్ ఇచ్చారు. కాటికి కాలు చాచిన చంద్రబాబును చంపే అవసరం ఎవరికీ లేదన్నారు.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే 150 హత్యలు జరిగాయని ఎమ్మెల్యే ఆరోపించారు. పరిటాల రవి హయాంలో ఎన్ని హత్యలు జరిగాయో అందరికీ తెలుసన్నారు. పరిటాల రవి అనుచరుడు జగ్గతో అమ్మను తిట్టించారని.. కొడుకులుగా మాకు బాధ ఉండదా..? అంటూ ఆవేదన వ్యక్తం చేసిన విషయం విదితమే.

## అప్పర్ భద్ర ప్రాజెక్టు రాయలసీమకు ఉరితాడు

కర్నూలు, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): అప్పర్ భద్ర ప్రాజెక్టు రాయలసీమకు ఉరితాడు అవుతుందని బీజేపీ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు రూపంలో రాయలసీమకు మరో విపత్తు పొంచి ఉందని పేర్కొన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, తొలి విడతలో 5,400 కోట్లు కేటాయించడం దారుణమని మండిపడ్డారు. అప్పర్ భద్రకు వ్యతిరేకంగా సిద్ధేశ్వరం ప్రాజెక్టు సాధన కోసం ఈనెల 25వ తేదీ నుంచి పాదయాత్ర చేపడతామని అన్నారు. 25న ఆర్డీఎస్ నుంచి ఆదోని వరకు పాదయాత్ర చేసి.. 28న ఆదోనిలో భారీ ర్యాలీ, సభ నిర్వహిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అన్యాయం జరుగుతుందని, ఇది ప్రత్యేక రాయలసీమ రాష్టం డిమాండ్‌కు దారి తీస్తుందని హెచ్చరించారు. రాజకీయల కంటే రాయలసీమ ప్రయోజనాలు ముఖ్యమన్నారు. సంగమేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజి నిర్మిస్తేనే రాయలసీమకు ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు. కేవలం ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తే రైతులకు ప్రయోజనం లేదని తేల్చి చెప్పారు. అన్ని వర్గాల నుంచి బ్రిడ్జి కం బ్యారేజి నిర్మించాలని మద్దతు లభిస్తోందన్నారు. సిద్ధేశ్వరం అలుగు కోసం చాలా ఏళ్లుగా డిమాండ్ ఉందన్నారు. బ్రిడ్జి కం బ్యారేజి కోసం 12వ తేదీ రాయలసీమలోని 52 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. అంతకుముందు కూడా రాయలసీమ ప్రయోజనాల కోసం చేస్తున్న పోరాటానికి ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి రావాలని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. కృష్ణానదిపై సంగమేశ్వరం వద్ద బ్రిడ్జి - బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేసిన ఆయన.. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోకపోతే, రాయలసీమకు నీటి చుక్క కూడా మిగలదని హెచ్చరించారు. దక్షిణ భారతదేశంలో అత్యంత తక్కువ నీటి పారుదల ఉన్న జిల్లా చిత్తూరు జిల్లా అని లెక్కలు చెబుతున్నాయన్నారు. 75 ఏళ్లుగా రాయలసీమకు నేతలు మోసం చేస్తూ వస్తున్నారన్నారు.

# రిమోట్ ఓటింగ్‌పై పార్టీల నుంచి అభిప్రాయసేకరణ

## రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రశ్నకు న్యాయ శాఖ మంత్రి జవాబు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మనం బ్యూరో: రిమోట్ ఓటింగ్ ప్రతిపాదనపై ఎన్నికల సంఘం వివిధ రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయ సేకరణ జరుపుతోందని న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజుజు తెలిపారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఓటింగ్ ప్రక్రియలో దేశంలోని వలస కార్మికుల భాగస్వామ్యం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గత ఏడాది డిసెంబర్ 28న ఒక నోట్ను జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు సర్క్యులేట్ చేసినట్లు చెప్పారు. వలస ఓటరును ఏ విధంగా నిర్వచించాలి, వారు ఏ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించాలి, రిమోట్ ఓటింగ్ విధానం, వారి ఓట్ల లెక్కింపు, వారికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఏ విధంగా వర్తింప చేయాలి, వారు స్వేచ్ఛగా, స్వతంత్రంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనువైన వాతావరణ కల్పించడం వంటి అంశాలపై అభిప్రాయాలు తెలియ చేయవలసిందిగా ఆ నోట్లో వివిధ రాజకీయ పక్షాలను కోరినట్లు మంత్రి వెల్లడించారు. దీనికి అనుగుణంగానే వివిధ రాజకీయ పార్టీలతో ఈ ఏడాది జనవరి 16న చర్చలు నిర్వహించడం జరిగింది. రిమోట్ ఓటింగ్ విధానానికి సంబంధించి న్యాయ, పాలనా, సాంకేతికపరమైన అవరోధాలను ఏ విధంగా అధిగమించవచ్చునో ఈ నెల 28లోగా రాతపూర్వకంగా తమ అభిప్రాయలు, ఆలోచనలను తెలియచేయమని ఎన్నికల సంఘం వివిధ రాజకీయ పార్టీలను కోరినట్లు మంత్రి చెప్పారు.

## నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



ముమ్మిడివరం ఫిబ్రవరి 9 మనం న్యూస్ : అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం క్రివాని రేవు పంచాయితీ క్రివాని రేవు అగ్నికుల క్షత్రియ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం నడిమింటి సూర్య ప్రకాష్ శర్మ సిద్ధాంతి చే వేదోక్తంముగా పూజాదికాలు నిర్వహించి యాగశాల ప్రవేశం చేసి అఖండ దీపారాధన అంకు రారోపణ వాస్తు క్షేత్రపాలక నవగ్రహ దేవతారాధన అగ్ని ప్రతిష్ఠ ఆవాహిత హోమములు జలాధివాసం చేసిరి ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు క్రీ ధనుంజయవర్మ అద్దింగి గోవిందరావు క్రీ కాసుబాబు ఓలేటి ధర్మేంద్ర ఇల్లింగి తిరుపతిరావు సమరసత సేవ ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ పెన్నాడ శివ నాగరాజు ముమ్మిడివరం సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు పాల్గొని అమ్మవారికి పాలాభిషేకం జలాధివాసం కార్యక్రమాల్లో పాల్గొని పూజాధికాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం రేపు ఉదయం జరుగుతున్నది కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉత్సవ కమిటీ వారు కోరడమైనది.

## వృద్ధుడిని బురిడీ కొట్టించి మోటార్ సైకిల్ అపహరణ

పాలకొల్లు, ఫిబ్రవరి 9, మనం ప్రతినిధి:: వృద్ధుడుని బురిడీ కొట్టించి ఓ యువకుడు మోటార్ సైకిల్ ను అపహరించిన ఘటన పాలకొల్లులో మంగళవారం జరిగింది. ఈ అపహరణకు పాల్పడింది 20 ఏళ్ల యువకుడు కావడం విశేషం. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొల్లు మండలం వెలివెల గ్రామానికి చెందిన చుక్క భాస్కరరావు అని 60 ఏళ్ల వృద్ధుడు హైదరాబాదులోని తన కుమార్తె ఇంటికి వెళ్లి బస్సులో ఈనెల ఏడో తేదీన పాలకొల్లుకు వస్తున్నాడు. అదే బస్సులో ఉన్న 20 ఏళ్ల యువకుడు వృద్ధుడిని పరిచయం చేసుకున్నాడు. తనది లంకలకోడేరు గ్రామము అని పరిచయం చేసుకుని లంకల కోడేరు వరకు ఇద్దరూ వచ్చి బస్సు దిగారు. అనంతరం ఇద్దరూ కలిసి ఏటీఎంలో డబ్బులు తీసుకోవాలని పాలకొల్లు వెళ్లాలని చెప్పి వృద్ధుడి కుమారుడు రాధాకృష్ణ నుండి హోండా యాక్టివా మోటార్ సైకిల్ తీసుకుని పాలకొల్లు వెళ్లారు. పాలకొల్లు సాయిబాబా గుడి వద్ద వృద్ధున్ని దింపివేసి తాను పాలకొల్లు ఏటీఎం నుంచి డబ్బులు తీసుకొస్తానని చెప్పి ఆ బండి వేసుకుని పరార్ అయిపోయాడు. దీంతో వృద్ధుడు భాస్కరరావు చేసేదేమి లేక రెండు రోజులపాటు వెతికి చివరకు పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

## లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల

## మైలవరం గ్రాండ్‌గా సిల్వర్ జూబ్లీ వేడుకలు



మైలవరం – ఫిబ్రవరి – 09 ( మనం న్యూస్ ): స్థానిక ఎల్బిఆర్సి ఇంజనీరింగ్ మైలవరం వారు ఫిబ్రవరి 11వ తేదీన గ్రాండ్ గా సిల్వర్ జూబ్లీ వేడుకలు జరపనున్నామని లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాల చైర్మన్ లక్కిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి మీడియాకు తెలిపారు. 1998సం' లో 180 మంది విద్యార్థులతో మొదలైన లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నేడు 5000 మంది విద్యార్థులకు చేరువైందని, ఈ కాలేజీ మన మైలవరం రావడానికి అప్పటిలో రాజకీయ నాయకులు, మైలవరం పుర ప్రముఖులు చాలా కృషి చేశారన్నారు.అని జ్ఞాపకం చేసుకున్నారు, ప్రస్తుత దినాలలో ఎల్ బి ఆర్ సి ఈ ఇంతగా ప్రాచుర్యం పొందటానికి వెనుక స్థానిక రాజకీయ నాయకులు అలాగే ( పాత్రికేయ మిత్రులు ) ప్రింట్ అండ్ ఎల్కట్రానిక్ మీడియా మిత్రుల కృషి కూడా ఎంతో ఉందని అందరికీ అభినందనలు తెలియజేశారు.అప్పటిలో మన కాలేజ్ లో చదివి బయటకు వెళ్లిన మన పూర్వ విద్యార్థులు కొందరు సెంట్రల్ , మరి కొందరు స్టేట్ గవర్నమెంట్ కేడర్ లో ( మంచి ఉద్యోగాలు ) చేస్తున్నారని , ఇంకా చాలా మంది ఈ కాలేజ్ నుండి మంచి మంచి ( విప్రో , టిసియస్, టాటా, హీరో, ఐబిఎం ,టీవీఎస్ , జంకో, హోండా ,హెచ్సిఎల్, కియా ఇలా మొదలగు ) ప్రముఖ కంపెనీల ఇంటర్వ్యూస్ లో జాబ్స్ సాధించారని , సంతోషాన్ని వ్యక్తం పర్చిరి . స్టేట్ వైడ్ గా , సెంట్రల్ వైడ్ గా మన కాలేజీకి మంచి గుర్తింపు ఉందని టాప్ లిస్టులో మన కాలేజీ పేరు ఉండడం మన మైలవరం ఎల్బీ ఆర్ సి ఈ గర్వకారణం అని చెప్పారు , రానున్న మరి కొద్ది రోజుల్లోనే యూనివర్సిటీ చేసేదిశగా అడుగులు వేస్తున్నామని ఆయన అన్నారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు పూర్వ విద్యార్థులు మరియు నేటి విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హాజరవుతున్నట్లు తెలిపారు.

## పండించిన పంటలకు రక్షణ లేకపోతే ఏలా

### సి.పి.ఎం.పార్టీ జిల్లానాయకులు పూనెం సత్యనారాయణ డిమెండ్



వి.ఆర్.పురం ఫిబ్రవరి 9 మనం న్యూసు: వి ఆర్ పురం మండలంలో వరి పండించిన రైతులు పరిస్థితి చాలా దయనీయంగా మారింది. ఎండకు ఎండి, వానకు తడిసి, ఆరుగాలం పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధరలు లేకపోగా, ఆర్.బి.కె.కేంద్రాల్లో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని సి.పి.ఎం.పార్టీ జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ ఆరోపించారు గురువారం ఆర్.బి.కె,సెంటర్లలో రైతులను ఉద్దేశించి మా ట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం, రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. పశువులు, మేకలు, పందులు, రైతులు,ఆర్.బి.కె.సెంటర్ కి తీసుకొచ్చిన ధాన్యాన్ని తింటున్నాయని, అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కష్టపడి రైతు పండించిన పంటను దుబారా,పశువులు పాడుచేస్తే ఆపాపం ఊరికే పోదని ఆయన అన్నారు. ఈ ఆర్.బి.కె సెంటర్ ను పరిశీలించిన, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు,ఎం.పి.టి.సి.పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ సరోజిని రైతులు నాయకులు, కారం సత్తిబాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకు అంకితమైన యెండూరి

### నాగేశ్వరరావు, రాఘవ దంపతులకు సన్మానం



అమలాపురం ఫిబ్రవరి 9 మనం న్యూస్ : ఆధ్యాత్మిక, సమాజ సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న అమలాపురం పట్టణానికి చెందిన యెండూరినాగేశ్వరరావు ,యెండూరిరాఘవ దంపతులను శ్రీశ్రీ కళావేదిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ , కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం జరిగిన సభలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ జాతీయ చైర్మన్ అక్షర తపస్విడాక్టర్ కత్తిమండ ప్రతాప్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం పట్టణంశ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలుగాయెండూరి రాఘవ , నాగేశ్వరరావు లు చేస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. సేవారంగానికి అంకితమైన దంపతులిద్దరూ శ్రీ శ్రీ కళావేదికలో సభ్యులు కావడం ఆనందదాయకం అన్నారు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, మాట్లాడుతూ సాహితీ రంగంలో కూడా దంపతులిద్దరూ సేవలు అందించాలని కోరారు.. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండరు ను దంపతులిద్దరూ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కు, కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి కి కళావేదిక కార్యవర్గ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. జిల్లా కన్వీనర్, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షులు బి.వి.వి సత్యనారాయణ,, కదలి సత్యనారాయణ, మాకే బాలా ర్జున సత్యనారాయణ, పాల్గొన్నారు.

## కరవ్డ్ స్క్రీన్, 108ఎంపి కెమెరాతో ఒప్పో రెనో 8 టి 5జి

గాంధీనగర్, ఫిబ్రవరి 9, మనం న్యూస్: ప్రముఖ గ్లోబల్ స్మార్ట్ డివైజ్ బ్రాండ్ ఒప్పో, భారతదేశంలో రెనో8 టి 5జిని రూ.29,999 ధరలో విడుదల చేసింది. ఆర్ అండ్ డి, ఎ స్టెప్ ఎబౌవ్ వినియోగదారు అనుభవాన్ని అందించే స్మార్ట్ఫోన్ను ఉత్పత్తి చేసేందుకు సాంకేతిక ఆవిష్కరణలకు బ్రాండ్ నిబద్ధతకు ప్రసిద్ధి చెందింది. రెనో8 టితో, ఒప్పోవినియోగదారులకు ప్రీమియం రెనో అనుభవాన్ని సృష్టించేందుకు డిజైన్, డిస్ప్లే, కెమెరా, పనితీరు, బ్యాటరీలో స్వదేశీ సాంకేతికతలతో స్మార్ట్ఫోన్ హార్డ్వేర్ను మెరుగుపరిచింది. ఒప్పోగ్లోతో మైక్రో కరవ్డ్ డిజైన్ రెనో8 టి 5జి ఒక సౌకర్యవంతమైన ఇన్-హ్యాండ్ అనుభూతితో సౌందర్యాన్ని బ్యాలెన్స్ చేసే కరవ్డ్ డిజైన్ను ప్రదర్శిస్తుంది. సౌకర్యవంతమైన గ్రిప్పు అందించేందుకు స్క్రీన్ కచ్చితమైన 56 డిగ్రీల వంపు, 1.9 మి.మీ. ఆర్క్ ఎత్తును కలిగి ఉంది.



## బుచ్చిబాబు ఆధ్వర్యంలో తెదేపాలో చేరికలు

కాట్రేనికోన ఫిబ్రవరి 9 (మనం న్యూస్): డాక్టర్ బి. ఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐ. పోలవరం మండలం మురముల్లలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముమ్మిడివరం నియోజకవర్గం ఇంచార్జ్ దాట్ల బుచ్చిబాబు పుట్టినరోజు సందర్భంగా కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ పరిధిలో గురువుపేటకి చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కందికుప్ప హైస్కూల్ ఎస్ఎం సీ చైర్మన్,కందికుప్ప పంచాయతీ వార్డు మెంబర్ కాశి పద్మ వెంకటరమణ ముమ్మడివరం నియోజకవర్గ ఇంచార్జ్ బుచ్చిబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయ్యారు తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయిన నాయకులు, కార్యకర్తలకు దాట్ల బుచ్చిబాబు గారు తెలుగుదేశం పార్టీ కండువకప్పి పార్టీలోనికి ఆహ్వానించినారు. కాశి పద్మవెంకటరమణతో పాటు 30 మంది వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాశి శివబాబు, కాశి సురేష్, కాశి నవీన్, బళ్ళ నాగేంద్రప్రసాద్, కాశి ఏడుకొండలు, కందికట్ల ధనకేశవరావు, మట్టా నరేష్, దేవరపల్లి పండు, చుట్టుగుళ్ల మనోహర్, చుట్టూగుళ్ల చిన్నా, నల్లా సత్యనారాయణ, కాశి శేఖర్ బాబు, కందికట్ల పవన్ కుమార్ తదితరులు తెలుగుదేశం పార్టీలో బుచ్చిబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయ్యారు, ఈ కార్యక్రమంలో కాట్రేనికోన మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెంట్రు సుధీర్, జిల్లా బి.సి సెల్ అధికార ప్రతినిధి విత్తనాల వెంకటరమణ, కందికుప్ప తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ డీ.సి ఆకాశం శ్రీనివాస్, కందికుప్ప గ్రామకమటీ అధ్యక్షులు గెద్దం అరుణ్, నూకల పెదకాపు, గ్రామకమిటీ ప్రధాన కార్యదర్శి, కదలి వెంకట సత్యనారాయణ, విత్తనాల జయభార్గవ్, బరువు ధనబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పియాజియో పేరు ప్రఖ్యాతులకు

## కళంకం తెచ్చేవారిపై చట్టపరమైన చర్యలు

గాంధీనగర్, ఫిబ్రవరి 9, మనం న్యూస్: పియాజియో వెహికల్స్ ప్రై.లి.కి చెందిన ఉత్పత్తుల పేరు ప్రఖ్యాతులకు హాని చేసే, కళంకం కలిగించే ఉద్దేశ్యంతో కొంతమంది మోసపూరిత వ్యక్తులు పియాజియో పేరు, ఉత్పత్తి, ట్రేడ్మార్క్, ఉత్పత్తి పేరు మరియు లోగోను అనధికారికంగా ఉపయోగిస్తున్నారని సంస్థ ప్రతినిధులు ప్రజలకు తెలియజేశారు. అటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియలో పియాజియో ఉంది. ఇలాంటి మోసపూరిత కార్యకలాపాలు, దుష్ప్రవర్తనతో కూడిన పక్షాలు వ్యాప్తి చేసే తప్పుడు సమాచార ప్రచారాల బారిన పడకూడదని సాధారణ ప్రజలను పియాజియో కోరింది.

## యధాస్థానంలోకి స్వామి వారి రథం



అంతర్వేది ఫిబ్రవరి 9 మనం న్యూస్ : శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం ఉత్సవాల పూర్తయిన సందర్భంగా శ్రీ స్వామి వారి రథాన్ని 16 స్తంభాల మండపం వద్ద నుండి ఆలయం వద్దనున్న రథం షెడ్డులోనికి వాహనకారులు గురువారం చేర్చినట్లు అసిస్టెంట్ కమీషనర్ సత్యానారాయణ, తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ సూపరిండెంట్ విజయ సారధి, మరియు సఖినేటిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఏ.ఫణి మోహన్ , గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైలలానికి ప్రత్యేక సర్వీస్ ఏర్పాటు

### దర్శనం టికెట్‌కు ఆర్టీసీ ద్వారా అవకాశం



అమలాపురం ఫిబ్రవరి 9( మనం న్యూస్): ఆర్టీసీ ఆన్లైన్ టికెట్ రిజర్వేషన్ ద్వారా శ్రీశైలం దర్శనం టికెట్లు అమలాపురం డిపో నుండి సాయంత్రం ఐదు గంటలకు శ్రీశైలం సూపర్ లగ్జరీ సర్వీస్ ఆపరేట్ చేయడం జరుగుచున్నదని అమలాపురం డిపో మేనేజర్ సిహెచ్ఎస్ ఎన్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ సర్వీస్కు ముందస్తు రిజర్వేషన్ టికెట్లతో పాటు శ్రీశైలం దర్శనం టికెట్లు ఆన్లైన్లో బుక్ చేసుకునే అవకాశం గురువారం (9-2-2023)నుండి ఏపీఎస్ఆర్టీసీ అవకాశం కల్పించడం జరిగినదని ఆయన తెలిపారు సర్వదర్శనం టికెట్లు 500 రూపాయలు( ఒక్కొక్కటి) అతి శీఘ్ర దర్శనం టికెట్లు 300 రూపాయలు( ఒక్కొక్కటి) శీఘ్ర దర్శనం టికెట్లు 150 రూపాయలు (ఒక్కొక్కటి)గా నిర్ణయించడం జరిగింది ప్రయాణికులు అడ్వాన్స్ టికెట్ రిజర్వేషన్ తో పాటు ఏపీఎస్ఆర్టీసీ నియమించిన ఏపీఎస్ఆర్టీసీ పోర్టల్ ద్వారా శ్రీశైలం దర్శనం టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉన్నదని ప్రత్యేకంగా నియమించిన ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు ఇబ్బంది లేని దర్శనానికి సహకరిస్తారని ఏపీఎస్ఆర్టీసీ అందించిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవలసినదని మరియు శివరాత్రి సందర్భంగా రెగ్యులర్ శ్రీశైలం సర్వీస్ తో పాటు ఈ నెల 11నుండి ప్రత్యేక బస్సులు నడపబడుచున్నవని వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ టికెట్ సదుపాయం కూడా అందుబాటులో ఉన్నదని ఆయన తెలియజేశారు.

## ఏజెన్సీలో ఆశ్రయము హ్యాడ్ ఆఫ్ హోపు ఉచిత వైద్య శిబిరం



వి ఆర్ పురం 9 ఫిబ్రవరి మనం న్యూస్: వి ఆర్ పురం మండలం పెద్దమట్టపల్లి మండలం ,పెద్ద మట్టపల్లి గ్రామంలో పాస్టర్ పి బోయాజు(రమణ)ఆధ్వర్యంలో హ్యాండ్ ఆఫ్ హోప్ ద్వారా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిర డైరెక్టర్ కె జవహర్ కెనడి మాట్లాడుతూ ఈ శిబిరంలోకి పరీక్షల నిమితం వచ్చిన ప్రతి ఒక్కరిని పరీక్షించి మందులు టానిక్ లు జరుగుతుంది అంటూ మా కెంపులో ఎక్స్ రే,ఈసిసి,రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, డెంటల్ పరీక్షలు,జనరల్ పరీక్షలు, బిపి,షుగర్,టెస్టులు చేసి మందులు ఇవ్వటం జరిగింది అన్నారు.అలాగె ల్యాబ్ టెక్నేష మాట్లాడుతూ బైట హాస్పిటల్ ల్లో ఇసిసి చేస్తే 3 వేలు రూపాయలు తీసుకుంటారు.కానీ ఈ గిరిజన ఏజెన్సీ మారుమూల ప్రాంతంలో ప్రజల మధ్యకు మా మొబైల్ క్యాంపు లో ఒక్కరూపాయి కూడా ఆశించకుండా ఉచితంగా సర్వీస్ మంరియూ మందులు ఇస్తున్నాము అన్నారు.ఈ కార్యక్రమంలో మెడికిల్ ఆర్గనైజర్ కె జవర్ కెనడి,ల్యాబ్ టెక్కీషి జయరాజు.డాక్టర్ చార్లీ.డాక్టర్ రవితేజ.డాక్టర్ సురేష్. డాక్టర్ శ్రావ్య. డాక్టర్ నిరీక్షణ. డాక్టర్ సంపత్.స్థానిక పాస్టర్ యం బోయాజు. పాల్గొన్నారు.

# జగ్గంపేట వైసీపీ బరిలో పోటీకి సిద్ధం అంటున్న ఒక బీసీ యువ లాయర్

జగ్గంపేట ఫిబ్రవరి 9(మనం న్యూస్). కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం లో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం. రాబోయే అసెంబ్లీ జనరల్ ఎలక్షన్ దృష్టిలో ఉంచుకొని వివిధ పార్టీల వారు తమ తమ పార్టీ నాయకులను కలుసుకొని అభ్యర్థులను గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ వారు జగ్గంపేట పాయింట్ జ్యోతుల నెహ్రూ కి ఖరారు చేసినట్లు వినికిడి. ఇక అధికార పార్టీకి వస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఉండగా, మాజీ ఎమ్మెల్యే మరియు మంత్రి తోట నరసింహం ఇదే నియోజకవర్గము నుండి వైయస్సార్సీపి తరపున పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇదే తరుణంలో జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన చింతలపూడి రమేష్ అనే యువ లాయర్ తాను వైయస్సార్సీపి తరపున పోటీ చేయనున్నట్లు గురువారం గోకవరం రోడ్లో ఉన్న క్షత్రియ ఫంక్షన్ హాల్ లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి తన అభిప్రాయాన్ని తెలియజేశారు. తాను గోకవరం మండలం కొత్తపల్లి గ్రామ నివాసి నని వృత్తి రీత్యా లాయర్ గా పనిచేస్తున్నానని జగ్గంపేట నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి ఇం తవరకు బీసీ కులం వారు ఎమ్మెల్యే కా లేక పోయారనిఈ నియోజకవర్గంలో ఏ బి సి తరగతుల బీసీ కులస్తులు ఎక్కువగా ఉన్నారని ఇటీవల ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన్ రెడ్డి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ఉన్న పుడు ఆయన నుకలసి, ఆయన దృష్టిలో తనపేరు ప్రతి ఫాదననుఉంచినట్లుతెలిపారు. అందుకు ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జయాప జయాల పై



సర్వే నిర్వహించి చూస్తామని తదనుకూలంగా స్పందించార నితెలియజేసారు. తనకు వైయస్సార్సీపి పార్టీ ఏర్పడిన నాటి నుండి పార్టీ పరంగా అనేక సేవా కార్యక్రమాలలో పాలు పంచుకున్నానని తాను లాయర్ అవ్వట ౘేత అవసరమైన వ్యక్తులకు అనేక మందికి న్యాయ సలహాలు ఇవ్వడమే కాకుండా జగన్మోహన్ రెడ్డి ఆశయాలు పథకాలు ప్రజలకు అందించే క్రమములో సేవా దృక్పథంతో పనిచేస్తూ ఉన్నానని తెలియజేశారు. ఎంఎల్.ఏ.గాగెలుపొందినతరువాత, ఫ్రెండ్లి ఎంఎల్ఏ ప్రజా దర్బార్ కాన్సెప్ట్ తో వారానికి ఒక మండలం లో ప్రజా సేవే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని రమేష్ తెలియజేశారు.

# టెన్త్ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయండి

## డీఈవో సివి రేణుక

మైలవరం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): చిలుకూరివారి గూడెం జడ్పీ పాఠశాలను సాధారణ తనిఖీలు నిర్వహించిన డీఈవో, విద్యార్థుల నోట్సు , స్కూల్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన రేణుక . పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇప్పటినుంచే విద్యార్థులను సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారిని సివి రేణుక ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆమె మైలవరం మండలంలోని పుల్లూరు గ్రామ శివారులో చిలుకూరి వారి గూడెం అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాధారణ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు , మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నది లేనిది పరిశీలన చేశారు, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులతో మమేకమై రానున్న పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి ఎక్కువ మార్కులు ఎలా సాధించాలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులతో డీఈవో మాట్లాడుతూ నూతన విద్యా



విధానం పరిచయం చేయాలన్న ఉద్దేశంతో బైజుస్ ప్రీ లోడెడ్ కంటెంట్తో రూపొందించిన ట్యాబ్ లను తప్పనిసరిగా పాఠశాలలకు తీసుకొని రావాలని విద్యా విషయాలకు సంబంధించి ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే విద్యార్థులు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె ఆంగ్లంలో టెన్త్ విద్యార్థుల ప్రావీణ్యత పై ఉద్యోగులతో చర్చించారు, పిల్లలు ఆంగ్ల భాష పై పట్టు సాధించడం ముఖ్యమని తెలిపారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ కు సంబంధించి విద్యార్థులు నోట్ బుక్స్, వర్క్ బుక్స్ ను డీఈఓ రేణుక పరిశీలించారు. అలాగే పాఠశాల రికార్డులను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఏకరూప దుస్తులను విద్యార్థులు తప్పనిసరిగా ధరించి పాఠశాలకు వచ్చేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచనలు చేశారు, ప్రతి ఒక్క విద్యార్థి బూట్లు తప్పనిసరిగా ధరించాలని తెలియచేశారు . మొదటిసారిగా పాఠశాలలను సందర్శించిన డీఈవో రేణుకాను పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములకొండ నారాయణ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

## ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల్లో ఆర్థిక భరోసా లభించిందని పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఏర్పడిందని వీటి ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రయత్నించడం సంతోషదాయకమని ఆమె తెలిపారు. జీకే వీధి మండలం దామనాల్లి పంచాయతీ కి చెందిన అన్నవరం, ఎస్సార్ నగర్ కాలనీ, పులుసు మామిడిలొద్ది, సిగనపల్లి, లింగవరం, మోతిక బంద గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. మొత్తం ఇప్పటి వరకు 287 గడపలను సందర్శించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని గడపగడపలోను తెలియజేశారు. ఈ గ్రామాల్లో శాసనసభ్యులు పర్యటిస్తున్న సమయంలో ప్రతి ఇంట స్వాగతం లభించింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వలన కొందరు గొర్రెలను, కొందరు మేకలను, పశువులను మరికొందరు ఇంటి వద్ద ఉండే పిండి మిల్లులను కొనుగోలు చేసుకుని వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చాలామంది ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వచ్చినటువంటి డబ్బులతో ఉపాధి మార్గాలను ఎంచుకోవడం సంతోష దాయకమని భాగ్యలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుందరి రామకృష్ణ, వైస్ సర్పంచ్ చిలకమ్మ, ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటిసి కిముడు శివరత్నం, మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, జీకే విధి సర్పంచ్ కొర్ర సుభద్ర, వైస్ సర్పంచి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ జైతి రాజులమ్మ, వైస్ చైర్మన్ యిర్మియ, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, ఎంపీటీసీలు పసుపులేటి నాగమణి, కృష్ణమూర్తి, సచివాలయం కన్వీనర్ సతీష్, సీనియర్ నాయకులు రాజారావు, సిహెచ్ బాలరాజు, తెల్లన్నదొర, కృష్ణపడాల్, వార్డు మెంబర్లు సావిత్రి, పార్వతమ్మ, వార్డ్ మెంబర్లు నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



## దేవీపట్నం నూతన ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించిన సబ్ కలెక్టర్ శుభం బన్సాల్



దేవీపట్నం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): పోలవరం ముంపు ప్రాంతలైన దేవీపట్నం పూడిపల్లి గ్రామాలకు సంబంధించి గోకవరం లోని గంగాలమ్మ గుడి వెనుక నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీనీ రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభమ్ బన్సాల్ సందర్శించారు. గృహాల నాణ్యతను పరిశీలించి అధికారులకు ,సైట్ ఇంజనీర్లకు తగిన సూచనలు చేశారు. గృహల నిర్మాణాన్ని త్వరిగతిన పూర్తి చేసి నిర్వాసితులకి అందించాలని ఆదేశించారు. పలువురు నిర్వాసితులు తొమ్మిది ఎకరాలకు సంబంధించి న స్థలాన్ని సబ్ కలెక్టర్ నీ అడగ్గా వెంటనే గోకవరం మరియు దేవీపట్నం ఎమ్మార్వోలను దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని కోరారు. తొమ్మిది ఎకరలా విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి త్వరితన సైట్లు అందించేందుకు కృషిచేసి నిర్వాసితులకు అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## హనుమంతరావు నేత్రదానం



కె గంగవరం, ఫిబ్రవరి 9, మనం న్యూస్: కె.గంగవరం గ్రామానికి చెందిన గంగాపాత్రుల హనుమంత రావు గురువారం మరణించారు. భార్య లక్ష్మి, కుమారుడు సత్యనారాయణ, కుమార్తెలు కాశీ అన్నపూర్ణ, సత్యవేణి ఇంత బాధలోను మరొకఇద్దరుకు కంటి చూపును. అందజేయాలని సంకల్పంతో బాదం బాలక్రిష్ణ ఐ బ్యాంక్, కాకినాడ వారికి నేత్రదానం చేయటం జరిగింది. కె గంగవరం మెయిన్ రోడ్‌లో తొలిసారిగా కిళ్ళీషాపు, కాఫీ హోటల్ నిర్వహణ చేశారు. దైవకార్యక్రమాలో ముందుగా పాలు పంచుకోవడం జరిగేది. తొలిసారి భవానిమాల వేసీ, దేవిని ప్రతి సంవత్సరం పూజలు నిర్వహిస్తారు. మంచిమనిషి,కల్మషం లేని వ్యక్తి, అందరితో ఆప్యాయతతో వుండే అయనను పరిచయస్తులు అందరూ చాలా బాధపడుతూ కుటుంబసభ్యులు ధైర్యంగా వుండాలని కోరుతున్నారు. సానుభూతిగా వ్యాపారస్తులు స్వచ్ఛందంగా మూసివేయడం జరిగింది.

## అదుపుతప్పిన లారీ తృటిలో తప్పిన ప్రమాదం

తాళ్లపూడి, 9 జనవరి (మనం న్యూస్) కొవ్వూరు పోలవరం ఏటిగట్టు రోడ్ లో వేగేస్వరపురం పంప్ హౌస్ వద్ద తరచు వాహనాలు ప్రమాదానికి గురవుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. పలు సంఘటనల్లో పంప్ హౌస్ రక్షణ గోడలు దెబ్బ తిన్న పరిస్థితు లు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యం లోనే గురువారం ఓ ఇసుక లారీ బ్రేక్ పడక అదుపుతప్పి రక్షణ గోడను రాచుకుంటు వెళ్లి వెనుక చక్రాలు, కమాను కట్టలు విరిగిపోయి ప్రమాదానికి లోనయ్యింది. అదృష్ట వశాత్తు ఎవరికి ప్రమాదం జరగలేదుకాని, ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగింది. సుమారు రోజు అంతా ఈ ఇబ్బందిని ప్రజలు ఎదుర్కొన్నారు.




## పైడిమెట్లలో 33 కెవి వైర్లు పూర్తిస్థాయిలో తొలగింపు

తాళ్లపూడి, 9 ఫిబ్రవరి (మనం న్యూస్) రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన తాళ్ళపూడి మండలం పైడిమెట్ట గ్రామం లో చోటుచేసుకున్న సంఘటన లో చిన్నారి బాలుని మృతినికి కారణమైన 33 కె. వి విద్యుత్ లైన్ లను పూర్తి స్థాయి లో మార్పులు చేసినట్లు ట్రాన్స్కో ఏ.డి.ఏ అచ్యుతాచారి తెలిపారు. ప్రమాద భరితమైన లైను మార్చటానికి వినియోగదారు నుండి 2లక్షల 38 వేల రూపాయల డిమాండ్ కట్టించి 33 కె.వి లైన్ ను మార్పు పనులను గురువారం నాటికి పూర్తి చేసి నట్లు ఆయన తెలిపారు. అప్పట్లో వివిధ పత్రికల్లో, మీడియా కథనాల్లో వచ్చిన సమాచారం వాస్తవానికి దూరంగా ఉన్నాయని, 33 కెవి లైన్ వేసిన తరువాతే నివాసం నిర్మించుకున్నారని, ఐనప్పటికి 33 కెవి లైన్ తొలగించాలన్న డిమాండ్ మేరకు నాయకుల, అధికారుల మౌలిక ఆదేశాల మేరకు ఆ ఇంటి వద్ద ఉన్న వైర్లను సంఘటన తరువాత తొలగించామని అన్నారు. శాఖ పరం గా మార్పు చేర్పులు కు తగిన సొమ్ము కడితేనే గాని సాధ్యం కాదని అందువల్లే 33 కెవి లైన్ మార్పులకు ఆలస్యమైంది అని తెలిపారు. నేడు పూర్తి స్థాయి లో సాంకేతిక పరమైన అనుమతులు తో 33 కె.వి వైర్లను తమ సిబ్బంది ఏ.ఈ వెంకట్రావు, తదితర సిబ్బంది సహకారం తో తొలగించినట్లు తెలిపారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ఎస్ఈబీ సీఐ మణికంఠ రెడ్డి




జీలుగుమిల్లి ఫిబ్రవరి 09 మనం న్యూస్ యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఎస్ ఈ బి సి ఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు.గురువారం రాష్ట్ర సరిహద్దు ఎస్ ఈ బి చెక్ పోస్ట్ వద్ద మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుటున్నారని హెచ్చరించారు.డ్రగ్స్ బారిన పడి ఆరోగ్యాన్ని సహితం పాడు చేసుకుంటున్నారని అన్నారు.దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దుల గుండా ప్రత్యేక నిఘా ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అందుకు గాను ప్రజలకు అవగాహనా కోసం సరిహద్దు గుండా భారీ హోర్డింగ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఎవరైనా మత్తు పదార్థాలు సేవించిన అక్రమంగా రవాణా చేసిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అందుకు గాను టోల్ ఫ్రీ నంబర్ 14500 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పిర్యాదు దారులు ఎవరైనా ఆ నంబర్ కు కాల్ చేసి పిర్యాదు చేయవచ్చనీ తెలిపారు.వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎస్ ఇ బి సిబ్బంది ప్రవీణ్,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు...

## ప్రభుత్వ పథకాలను జనాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి

### పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



గూడెంకొత్తవీధి ఫిబ్రవరి 9(మనం న్యూస్) ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లే బాధ్యత వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథలదేనిని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జీకే వీధి మండలం రించాడలోని 10 గ్రామ సచివాలయాల వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారధులతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అందించిన కిట్లను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తమదేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రూపురేకలు పూర్తిగా మార్చే ఆలోచనలో ఉన్నారని, ఆయన ఆశయాలను ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలను ప్రజలకు వివరించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యతను మీరంతా భుజస్కంధాలపై వేసుకోవాలని చెప్పారు. స్థానికంగా ఉన్న ప్రజలతో మంచి సత్సంబంధాలు వాలంటీర్లకు, కన్వీనర్లకు ఉంటాయని వారే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రథసారథులని చెప్పారు. 2024లో గెలుపు ఓటమి మీ చేతుల్లోనే ఉంటుందని ప్రభుత్వం చేస్తున్న మేలును మీరు ప్రజలకు చక్కగా వివరించగలిగితే గడపగడపకు వెళ్లి చెప్పగలిగితే జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయి తీరుతారని చెప్పారు. గడపగడపకు వెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి స్టిక్కర్లను ఆయా గృహస్తుల అనుమతితో అంటించి వారి మద్దతును జగన్ కు ఉండేలా కోరాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి కిముడు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ దేవుడు బాబు, మండల అధ్యక్షులు బొబ్బలి లక్ష్మణరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జైతి రాజులమ్మ, వైస్ చైర్మన్ యిర్మియా, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, పిఎసిఎస్ చైర్మన్ వ సుపర్తి ప్రసాద్, ఎఎంసీ డైరెక్టర్ అచ్యుత్, సర్పంచులు కొర్ర సుభద్ర, బొబ్బిలి లక్ష్మి , కార్యకర్తలు, వాలంటీర్లు, కన్వీనర్లు గృహసారధులు పాల్గొన్నారు.

## రోడ్లపై తిరుగుతున్న పశువులను బందులు దొడ్డికి తరలించిన మున్సిపల్ అధికారులు



జగ్గయ్య పేట ఫిబ్రవరి 9 మనం న్యూస్ జగ్గయ్యపేట పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న పశువులను బందుల దొడ్డికి తరలించినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు . గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గో సంరక్షణ అందరి బాధ్యత అని పట్టణంలో రోడ్లపై పశువులను వదులుతుండటం వలన ఆవులు ప్రమాదానికి గురి అవుతున్నాయని అలానే పాదచారులకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని అన్నారు. వీటిని రోడ్లపై వదల వద్దని పలుమార్లు వాటి యజమానులకు ముందస్తు జాగ్రత్తలు జారీ చేశామని అయినా వాటి యజమానుల నుంచి స్పందన కనిపించలేదన్నారు. రోడ్లపై యదేచ్ఛగా తిరుగుతున్న పశువులను బందుల దొడ్డికి తరలించామని అట్లు బంధించిన ఆవులను గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు.

## కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 9, మనం న్యూస్: విజయవాడ లోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గయ్య పేట నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు జగనన్న ఇళ్ల స్థలాలు పట్టాల పంపిణీ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షా పథకం తదితర కార్యక్రమాలపై సమావేశంలో సామినేని ప్రస్తావించారు సంబంధిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం..

### వెట్టి చాకిరీ నిర్మూలన చట్టంపై అవగాహన పెంచుకుందాం

జి మాడుగుల / పాడేరు . ఫిబ్రవరి 9. (మనం న్యూస్) అల్లూరి సీతారామరాజు జిల్లా లో పాడేరు లో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నేడు వెట్టి చాకిరి నిర్మూలన దినం సందర్భంగా వెట్టి చాకిరిని నిర్మలించాలని అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో లేబర్ డిపార్ట్మెంట్ అల్లూరి జిల్లా ఇంచార్జి టి.సుజాత పాల్గొని మాట్లాడుతూ 1976 నాటి వెట్టి చాకిరి (నిర్మలాన) చట్టం ద్వారా ప్రభుత్వం బానిసత్వానికి గురిచేయటాన్ని చట్ట విరుద్ధం చేసింది.ఈ చట్టం గురించి ఈ నేరం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వెట్టి చాకిరి కార్మికులు లేని రాష్ట్రం గా తీర్చి దిద్దటానికి అందరం కలిసి కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు.అలానే కార్యక్రమం లో పాడేరు ఎస్సై లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ ఈ చట్టం లో పేర్కొన్న ప్రకారం వెట్టి చాకిరి అనేది బలవంతంగా శ్రమ చేయించుకొని కనీస వేతనాన్ని ఇవ్వక పోవడం కిందనే వస్తుందని అలానే ఈ విధానం లో కార్మికులను ఋణగ్రస్థులు చేస్తూ వారి పని చేసిన శ్రమ కు తగ్గ వేతనాలు ఇవ్వకుండా వారికి ఈ వెట్టి చాకిరి లో చిక్కుకు పోయేలా చేయటం అవుతున్నదని అన్నారు.వీటి మూలం గా కార్మికులు హక్కులు ని హరించి.వారి స్వేచ్ఛను వారికి దక్కకుండా చేయటం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో లేబర్ ఇన్స్పెక్టర్ దేవి గణేష్ పాల్గొని మాట్లాడుతూ కార్మికులు తమ ఇష్టమైన చోటికి వెళ్లి పని చేసే హక్కులు హరించబడుతున్నాయని అలానే ఇష్టమైన పని చేసే స్వేచ్ఛను కోల్పోవటం హారుగుతున్నదని, శ్రామికులు చేసే ఉత్పత్తులని లేదా వస్తువులను మార్కెట్ విలువకు విక్రయించే హక్కు నిండి దూరం అవుతున్నారని అలానే చట్టబద్ధం గా సమాన పనికి సమాన వేతన్నాన్ని పొందలేక పోతున్నారని అన్నారు.ఈ సందర్భంగా ఏ ఐ టి యు సి జిల్లా కన్వీనర్ జల్లి రాజుబాబు మాట్లాడుతూ వెట్టి చాకిరి నిర్మలాన చట్టాన్ని ప్రజల్లోకి,కార్మికుల్లోకి తీసుకెళ్లి అవగాహన చేయలేక పోతే శ్రామికులు, కార్మికులు నష్టం పోవటం యజమానులకు బానిసలుగా మారటం జరుగుతున్నదని అన్నారు.కావున ఈ వెట్టి చాకిరి నిర్మూలన దినం సందర్భంగా అందరం ఈ చట్టం పై అవగాహన పెంచుకొని భవిష్యత్తులో వెట్టి చాకిరి లేని రాష్ట్రం గా నిర్మించాలని ప్రతిజ్ఞ చేయాలని తెలియచేయటం జరిగిందని అన్నారు.ఏ ఐ టి యు సి జిల్లా కో- కన్వీనర్ అమర్, పాడేరు హెడ్ కానిస్టేబుల్ రాంబాబు,కానిస్టేబుల్ వెంకటరావు, శ్రీ మోద ఉమ నీలకంటేశ్వర ఎలక్ట్రికల్ మరియు ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రామారావు, యూనియన్ అధ్యక్ష,కార్యదర్శి లు బబ్లూ, ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు వరప్రసాద్,మొదమాంబ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు నాని,రాము,ఏ ఐ వై ఫ్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.



## ఎడ్యుకేషన్ ఎక్స్ పో-2023 ప్రారంభం

విజయవాడ, ఫిబ్రవరి9 (మనం బ్యూరో): బెంగుళూరుకు చెందిన రియో, క్యూజర్ టెక్నాలజీస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బెంజి సర్కిల్ సమీపంలో గల వేదిక కల్యాణ మండపం లో ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఎక్స్ పో-2023 గురువారం ప్రారంభమైంది. ఇస్కాన్ ప్రెసిడెంట్ చక్రదరి దాస్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు మంచి వ్యక్తిత్వం, సమర్థతను కలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి తమవంతు చేయూ త అందించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిర పడాలంటే కాలానుగుణ ంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించే సంస్థల ఎంపిక చాలా కీలకమన్నారు. ఉన్నత విశ్వవిద్యాలయాలుగా ఉన్న బెంగుళూరుకు చెందిన ఎం ఎస్ రామయ్య విశ్వవిద్యాలయం, నిట్టే మీనాక్షి, సి యం ఆర్ విశ్వవిద్యాలయం, ఆచార్య వంటి ప్రముఖ సంస్థలను ఒక వేదికపైకి తీసుకువచ్చి విద్యార్థులకు కావాల్సిన సమాచారం తో పాటు కెరీర్ గైడెన్స్ ఇచ్చేందుకు ఎడ్యుకేషన్ ఎక్స్ పో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. దీని ద్వారా వారి అభిరుచులకు అనుగుణంగా కోర్సు , విద్యాసంస్థను ఎంపిక చేసుకునే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఎక్స్ పో నిర్వహకులైన రియో టెక్నాలజీస్, క్యూజర్ టెక్నాలజీస్, బెంగుళూరు స్టడీస్ మేనేజింగ్ డైరెక్టర్ లు వినయ్ రమేష్, సతీష్ లు మాట్లాడుతూ ఎక్స్ పో లో 20కి పైగా విద్యాసంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి భవిష్యత్తు ను ఉన్నతంగా తీర్చిదిదేసుకోవలని కోరారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎక్స్ పో ని సందర్శించి ఆయా సంస్థల ప్రతినిధుల నుంచి తమకు కావాల్సిన వివరాలు సేకరించుకున్నారు. శారదా కాలేజి జి యం జి వి రావు, శ్రీ కృష్ణ అకాడమీ డైరెక్టర్ బి కె దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో కనీస అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం



డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9, మనం న్యూస్: అరకు నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం కురిడి పంచాయితి కురిడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అధ్యక్షన గురువారం ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమం వైసిపి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని కురిడి గ్రామంలో కనీసం సీసీ రోడ్డు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం కల్పించలేని పరిస్తితిలో ఉందని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గెలిచి నాలుగెళ్లు గడిచిన గిరిజన ప్రాంత గ్రామాలలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేని దుస్తితి నెలకొందని అన్నారు. గ్రామాలలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలలో లెక్కలేనన్ని అభివృద్ధి జరిగిందని నేడు గొప్పలు చెప్పుకునే జగన్ ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో గుండెకాయ లాంటి జీవో నెంబర్ 3 రద్దు చేయడం వల్ల గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ శాతం అధికంగా పెరిగిపోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలందరు సిద్దంగా ఉన్నారని వైసిపి ప్రభుత్వనికి తగిన బుద్ది చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు ప్రజలందరు సిద్దంగా ఉన్నారని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కోశాధికారి వంతాల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, అరకువేలి మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కమిడి సుబ్బారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, మాజీ ఎంపీపీ కొర్ర దన్నేరావు, అరకు పార్లమెంట్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి మండ్యగురు స్వామి, అరకు మాజీ సర్పంచ్ చటరి వెంకటరావు, మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ కమిడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ భీమన్న, జిల్లా అధికార ప్రతినిధి పొద్దు అమ్మన్న, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రటరీ

కిల్లో సాయిరాం, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కొర్ర నర్సు, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కొర్ర నాగరాజు, మండల యూత్ అధ్యక్షుడు కిన్నుబుడ్డి సురేష్ కుమార్, అరకు అసెంబ్లీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రమేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లోరి ప్రసాద్, టీడిపి సీనియర్ నాయకులు అడికటియ సుబ్బారావు, వంతాల గురు, గణేష్, కిల్లో శ్యామ్, లవకుశ, పండు, గుజ్జెలి రాజు, గ్రామస్తులు ఎరికునాయుడు, జి అద్దు, గోపాలకృష్ణ, భీమన్న, జగబందు, కృష్ణమూర్తి, స్వామి, వెంకటరావు, రాజు, తదితరులు టీడీపీ కార్యకర్తలు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుదేశం ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్



జగ్గయ్యపేట ఫిబ్రవరి 9 మనం న్యూస్ విజయవాడలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బచ్చుల అర్జునుడిని జగ్గయ్య పేట మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరామ్ రాజగోపాల్ పరామర్శించారు. ఈ మధ్యకాలంలో బచ్చుల అర్జునుడు అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలో రమేష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం విధితమే వైద్యశాలకు వెళ్లి బచ్చుల అర్జునుని పరామర్శించి వైద్యులతో బచ్చుల అర్జునుడు ఆరోగ్యం పరిస్థితిని అడిగొ తెలుసుకున్నారు కుటుంబ సభ్యులు కలసి వారికి ధైర్యాన్ని చెప్పారు.

## జనసైనికులు, పార్టీ అభిమానులు క్రియాశీల సభ్యత్వం నమోదు చేయించుకోవాలి



గంగవరం ఏజెన్సీ ఫిబ్రవరి 9 మనం న్యూస్ జనసేన సైనికులు, జనసేన పార్టీ అభిమానులు క్రియాశీల సభ్యత్వాలను నమోదు చేయించు కోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుంజమ్ సిద్దు కోరారు.పార్టీ సభ్యత్వాలను మూడో దఫాగా ఈనెల 10వ తేదీ నుండి 28వ తేదీ వరకు నమోదు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల కోసం, వారికి భరోసా కల్పించడం కోసం పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రతినిత్యం ఆలోచిస్తూ ఉంటారని దీనిలో భాగంగానే ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా ఐదు లక్షల రూపాయలు వర్తించే విధంగా ప్రాణయాళికలు సిద్ధం చేయడం జరిగిందని సిద్దు అన్నారు.

## దేశం కోసం చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9(మనం న్యూస్): కొండపల్లి మటన్ మార్కెట్ సెంటర్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకుడు కాండ్రకొండ అప్పారావు ఆధ్వర్యంలో 'దేశం కోసం' చిత్రం పోస్టర్ ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రవీంద్ర గోపాల్ దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం దేశం కోసం ఈ నెల 10 న విడుదలవుతుందని చెప్పారు. ఈ చిత్రంలో రవీంద్ర గోపాల్ ఏకంగా 14 మంది స్వాతంత్ర్య సమరయోధుల పాత్రలు వేశారన్నారు. నేటి తరానికి గాంధీ, భగత్ సింగ్ అంటే ఎవరో తెలియని పరిస్థితి ఉందని, ఇలాంటి చిత్రాల ద్వారా ఎంతో మంది త్యాగ ఫలం మన స్వాతంత్ర్యం అనే విషయం తెలియజేయడమే ఈ చిత్ర కథాంశం అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ మొగిలి దయాసాగర్, వేములకొండ సుబ్బారావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



జగ్గయ్యపేట ఫిబ్రవరి 9 మనం న్యూస్ కేంద్ర బడ్జెట్ను నిరసిస్తూ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి బడ్జెట్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నేత కోటా కృష్ణ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సోమోజు నాగమణి తదితరులు మాట్లాడుతూ బడ్జెట్లో వ్యవసాయం ఎరువులు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఆహార సరఫరా ధాన్యం కొనుగోలు గృహ నిర్మాణాలు వంటి వాటికి కోత వి ధించారని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజల నోరులను కొట్టి బడా పారిశ్రామిక వ్యక్తులకు దోచి పెట్టేలా బడ్జెట్ ఉందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం కావాలని బిజెపి పాలిత రాష్ట్రాలకు నిధులు కేటాయింపులు ఇచ్చి ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు నిధులు కేటాయించలేదని అన్నారు . మున్సిపాలిటీలో నకిలీ బిల్లుల పై కఠిన చర్యలు తీసుకోవాలి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం అధికారులు ఇంటి పన్నుల చెల్లింపులు నకిలీ బిల్లులతో లక్షలాది రూపాయలను స్వాహా చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పేట మున్సిపాలిటీలో నకిలీల దందా ఎక్కువైందని ఆన్లైన్ చెల్లింపులు అయినప్పటికీ నకిలీ బిల్లులు తయారుచేసి లక్షలాది రూపాయలను స్వాహా చేయటం పై వారి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం నేతలు సోమోజు నాగమణి కోటా కృష్ణ దంతాల వెంకటేశ్వర్లు కాకనబోయిన లింగారావు షేక్ గౌస్మియా తదితరులు పాల్గొన్నారు.

## కొటికలపూడి సర్పంచ్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న రెంటపల్లి నాగరాజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్) : ఇబ్రహీంపట్నం మండలం, కొటికలపూడి గ్రామ సర్పంచిగా రెంటపల్లి నాగరాజు బాధ్యతలు స్వీకరించి నేటికి రెండేళ్ళు పూర్తి అయి, మూడవ యేడాదిలోకి అడుగిడుతున్న సందర్భంగా స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు కేకును కట్ చేశారు. ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో అక్కడి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

## వైసీపీ అధికారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇదేం ఖర్మ!?




జిమాడుగుల. ఫిబ్రవరి 9 మనం న్యూస్. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సామాన్యుల నుండి ధనవంతుల వరకు జగన్మోహన్ రెడ్డి వల్ల ఎప్పుడూ చేయలేని ఖర్మ అనుభవిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మత్స్యరాస మణి కుమారి అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలంలోని వంజరి గ్రామంలో పాడేరు నియోజకవర్గం సీనియర్ నాయకులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా కేవలం బటన్ నొక్కడంకే పరిమితమైనట్లు అన్నారు. కేవలం బటన్ నొక్కడం తప్ప రాష్ట్ర అభివృద్ధి మరిచిపోయారని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతంలో ఉన్న సంక్షేమ పాఠశాలలో నాడు నేడు కార్యక్రమాల్లో పాఠశాలలే కలర్ ఫుల్ గా ఉన్నాయని కనీస వసతులు అంతంత మాత్రమే అని అన్నారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గత ప్రభుత్వంలో హెల్త్ అసిస్టెంట్ పర్యవేక్షణలో ఉండి వైద్య సదుపాయం కల్పించామని. ఇప్పుడు హెల్త్ అసిస్టెంట్ లేకపోవడం పలు మరణాలు సంభవించి విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొర్ర నాగరాజు జిసిసి మాజీ చైర్ పర్సన్ ఎంవివి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నియంత పాలన పాటిస్తూ రాష్ట్రాన్ని అంధకారంలో నెట్టేసాడని ప్రభుత్వ ఉద్యోగులకు కూడా సరైన తేదీకి జీతాలు ఇవ్వలేని దౌర్భాగ్య పాలన సాగిస్తున్నారని అలాగే రాష్ట్ర పంచాయతీ నిధులు మళ్లించి ప్రభుత్వ ఖజానాలోకి మార్చుకొని సర్పంచులకు తీవ్ర అన్యాయం చేస్తూ వారికి తీవ్ర క్షోభ మిలిచారన్నారు. ఇప్పటికైనా నియంత పాలన మానుకొని రాష్ట్ర అభివృద్ధి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ ఎంపీపీ టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి బొర్ర విజయ రాణి, టిడిపి మాజీ అధికార ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు, మహిళా అధికార ప్రతినిధి బొడ్డేటి వరలక్ష్మి, చింతపల్లి మండల ఉపాధ్యక్షులు కిముడు లక్ష్మయ్య పోతురు రాంబాబు, టిడిపి సీనియర్ నాయకులు వంజరి రామ్మూర్తి నాయుడు, కిముడు పరమేశ్వరరావు, వంజరి దేవుడు నాయుడు, భారతమ్మ ,బాలమ్మ, రాజేశ్వరి టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్యాంపస్ నియామకాలలో యమ్.బి.ఏ విద్యార్థుల ప్రతిభ



మైలవరం - ఫిబ్రవరి -09 ( మనం న్యూస్) స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ నియమాకాలలో యమ్ .బి.ఏ విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకొని హెచ్సిఎల్ కంపెనీ లో 22 మంది విద్యార్థులు ఫైనాన్షియల్ ఎనలిస్ట్ ఉద్యోగానికి మరియు 48 మంది విద్యార్థులు ఐసిఐసిఐ బ్యాంకు లో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఇన్చార్జ్ కొండా, శ్రీనివాస రావు తెలిపారు. కళాశాలలో నిర్వహించిన వివిధ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ వలన విద్య పూర్తి కాకముందే ఇన్ని ఉద్యోగ అవకాశాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థులను మరియు ఇందుకు తోడ్పడిన అధ్యాపకులను మరియు సిబ్బంది ని కళాశాల హానరరీ చైర్మన్ లకి రెడ్డి జయ ప్రకాష్ రెడ్డి , ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి , ప్రిన్సిపాల్ .కె.అప్పారావు అభినందించారు. ఈకార్యక్రమంలో యమ్.బి.ఏ విభాగాధిపతి ఏ.ఆదిశేషారెడ్డి మరియు ప్లేసెమెంట్ సెల్ ఇన్ ఛార్జ్ కె.శ్రీనివాస్, ఎమ్.ఎస్ చక్రవర్తి, యల్.వేణు గోపాల్ పాల్గొన్నారు.

## అనాథ ఆడపిల్లకు పెళ్లి చేసిన రెవిన్యూ ఉద్యోగి దుమంతి సత్యన్నారాయణ దంపతులు



గూడెంకొత్తవీధి ఫిబ్రవరి 9(మనం న్యూస్) తల్లిదం డ్రులను కోల్పోయిన ఆడపిల్లకు అన్నీ తానై పెళ్లి చేసిన రెవి న్యూ ఉద్యోగి దుమంతి సత్య నారాయణ దపంతులు. దీంతో ఈ ప్రాంతీయులు సత్యన్నా రా యణ చేసిన పనిని కొనియా డారు. గూడెం కొత్తవీధి మండలం దుప్పిలవాడ పంచాయతీ బూసికొండ గ్రామానికి చెంది న బాబూరావు, రాములమ్మ దంపతులు 2015 లో ఆరునెలలు వ్యవధిలో మృతి చెందారు. దీంతో వారికి ఉన్న నలుగురు పిల్లలు అనాథల య్యారు. దీంతో ఈ విషయా న్ని అప్పట్లో పత్రికలు ఈ విషయాన్ని ప్రచురించడంతో రెవిన్యూ ఉద్యోగి సత్యన్నారాయణ దంపతులు స్పందించి నలుగురు చిన్నారుల ఆలనా పాలనా చూసేవారు. నలుగురు చిన్నారులకు దగ్గరుండి ఆయనే చదివించారు. పెద్దమ్మాయి స్వాతీ బీఎస్సీ పూర్తి చేయగా, రెండో అమ్మాయి లలిత బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. మూడో అమ్మాయి అనిత ఇంటర్మీడియట్ చదువుతు న్నారు. నాలుగో అమ్మాయి ఏడోతరగతి చదువుతుంది. ఈ నేపథ్యంలో వీరిలో పెద్ద కుమార్తె మరిగెల స్వాతీకు బుధవారం సీలేరులో వెంకటేశ్వరస్వామి ఆలయం లో సత్యన్నారాయణ దంపతులు దగ్గరుండి వివాహం జరిపించారు. మరిగెల స్వాతికు వివాహ తంతు సత్యన్నారాయణ దంపతులు నిర్వహించారు. వరుడు శంఖం రాంబాబుకు కాల్లు కడిగి కన్యాదానం ను సత్యనారాయణ దంపతులు చేశారు.

## జి.రాగంపేటలో కార్మికుల దుర్మరణం చాలా బాధాకరం

డుంబ్రిగుడ (పాడేరు), ఫిబ్రవరి 9, మనం న్యూస్: కాకినాడ జిల్లా పెద్దపురం మండలం జి రాగంపేట అంబటి సుబ్బన్న ఆయిల్ కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో ఐదు మృతులు అల్లూరి జిల్లా పాడేరు ప్రాంతా వాసులు కావడంతో సంఘటన విషయం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు సంఘటన స్థలానికి చేరుకుని కార్మికులు మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయం పట్ల ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబుకు సభ్యులు విశ్వేశ్వర రాజు తెలియజేశారు. మృతదేహాలు స్వగ్రామలకు తరలింపుకు జిల్లా అధికారులతో విశ్వేశ్వర రాజు మాట్లాడి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేయాలని కోరారు.మృతులు కుటుంబాలకి ముఖ్యంగా గిరిజనులకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా ఈ ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని అన్నారు.జరిగిన ప్ర మాదానికి గల కారణాలు కంపెనీ యాజమాన్యం తో విచారణ జరపడానికి సంఘటనా స్థలానికి నేరుగా శనివారం ఎస్టీ కమిషన్ పర్యటించనున్నట్లు తెలిపారు.

## కొల్లాపుట్టులో అంధకారం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9, మనం న్యూస్: మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో వీధిలైట్లు లేక ఆయా గ్రామాల గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొల్లాపూటు పంచాయితీ పరిధి లోని 16 గ్రామాలకు వీధి దీపాల కొరతతో అయ గ్రామ గిరిజనులు రాత్రిపూట బయటకు రావటం చాలా భయాందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాలకు సంబంధించి వీధిలైట్లు విద్యుత్ స్తంభాలకు లేకపోవడంతో గ్రామాలకు చిమ్మ చీకటితో ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.రాత్రిపూట సమయంలో చిన్నచిన్న విష జంతువులు చంచరిస్తుంటాయని స్థానిక వాసులు స్థానిక విలేకరుల ముందు వారి గోడు వెలబుచ్చారు.ఇంటి పన్ను సకాలంలో వసులు చేస్తున్నప్పటికీ నేటికీ వీధిలైట్లు వేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.ఈ విషయంపై అధికారు లు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

డుంబ్రిగుడ (పాడేరు), ఫిబ్రవరి9, మనం న్యూస్: పొట్ట కూటి కోసం కూలి పనులకు వెళ్లి కాకినాడ జిల్లా పెద్దపురంలో ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాంగి రాజారావు కోరారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ బీజేపీ జిల్లా పార్టీ తరుపున సంతాపం ప్రకటిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందటం వలనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఘటనకు కారకులైన ప్యాక్టరి యాజమాన్యంపై శాఖపరమైన చర్యలు తీసుకుని, మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కాఫీ రైతుల బకాయి సొమ్ము 60 కోట్లు రైతులకు ఐటీడీఏ చెల్లించాలి



డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9, మనం న్యూస్: కాఫీ రైతులకు చెల్లించాల్సిన బకాయి సుమారు 60 కోట్లను పాడేరు ఐటీడీఏ తక్షణమే చెల్లించాలని గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మండలంలోని రంగిలిసింగి పంచాయతీకింజేరి గ్రామంలో పంచాయతీ కాఫీ రైతుల గురువారం సదస్సు జరిగింది. ఈ మేరకు స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా హాజరైన గిరిజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు టి సూర్యనారాయణ, సోనగారికి పోతురాజు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఏజెన్సీ11మండల పరిధిలోసుమారు1లక్ష 30వేల కుటుంబాలు కాఫీసాగుపై ఆధారపడి జీవిస్తున్నట్లు వారన్నారు.2018 నుండి 2022వరకు సుమారు 5200 ఎకరల్లోకాఫీసాగుచేస్తున్న43247మంది గిరిజన కాఫీరైతులకు సొమ్ము సుమారు 60కోట్లుప్రభుత్వం బకాయి వుందన్నారు. అలా గేకాఫీరైతు లకు గిట్టుబాటు ధర పార్చి మెంట్ కాఫీకి రూ.500.కీల్లో చెర్రికాఫీ రూ.300, మిరియాలకు కీలో 1000 రూపాయిలు చొప్పునచెల్లించాలని డిమాండ్‌చేశా రు. బకాయి ఉన్న సొమ్ము60కోట్లు వెంటనే రైతులఖాతాలో జమ చేయాలని ఈ నెల17న ఐటిడిఏలోజరిగే ధర్నాను అదిక సంఖ్యలో పాల్గొని విజయ వంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఛొంబు, పి మోహన్ దాస్, కె అర్జున్, పి.దాస్, అధికసంఖ్యలో కాఫీ రైతులు పాల్గొన్నారు.

# పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లి, ఫిబ్రవరి 9, మనం న్యూస్ : లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల గ్రామం దియ్యలవాండ్లపల్లె కు చెందిన సుబ్బయ్య కుమారుని వివాహ వేడుకలలోనూ, లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లె గ్రామం గల్లావాండ్లపల్లెకు కు చెందిన గల్లా గురవయ్య కుమారుని వివాహ వేడుకలలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి,మాజీ ఎంపిపి అంపాబత్తిన రెడ్డెయ్య, విజయ భాస్కర్, బార్ సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవతా దేవస్థానం

● అమ్మవారికి కానుకగా నల్లపూసలదండ



అన్నమయ్య జిల్లా, ఫిబ్రవరి 9, మనం న్యూస్: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోనిలక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దేవతా దేవస్థానం అమ్మవారికి కానుకగా నల్లపూసల దండను (సరాసరి రూ.1,33,490/-లు బరువు - 30.730 గ్రాములు) సుండుపల్లె మండలం పెద్ద బలిజపల్లె గ్రామ వాస్తవ్యులు యన్.ఆంజనేయులు వారి ధర్మపత్ని యన్. లక్ష్మీ ప్రసన్నలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సామాల నరసింహారెడ్డి , కార్యనిర్వాహణ అధికారి సి.రవీంద్ర రాజు, పూజారి రెడ్డి శేఖర్, టీచర్ శివ శంకర్ రెడ్డి, అంగడి రమణ, దర్మకర్తలు వి.సుబ్బరాయుడు, సుబ్బయ్యలు పాల్గొన్నారు. కానుకను అందజేసిన దంపతుల కుటుంబంపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని తెలపారు.

# ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు చెక్కులు పంపిణీ



బంగారుపాలెం, ఫిబ్రవరి 9, మనం న్యూస్: బంగారుపాలెం మండల పరిధిలోని కోదలమడుగు, కీరమంద, మొగిలి వారి పల్లి గ్రామాలలో ఏనుగుల దాడుల వలన పంటలు నష్టపోయిన రైతులకు పలమనేర్ రేంజ్ ఆఫీసర్ నయీమ్ అలీ గురువారం చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టరాదని అలాగే మొగిలి నుండి సోలార్ కంచ ఏర్పాటు చేసేందుకు చిత్తూరు డిఎఫ్ఓ అనిల్ కుమార్ సహకరిస్తున్నారని గ్రామాల వైపు ఏనుగులు రాకుండా సోలార్ కంచే ఏర్పాటు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ రమేష్, ఎఫ్‌బిఓ లు శ్రీనివాసులు, ప్రేమలత, హైమావతి, సర్పంచ్ మాలతీ, ఎంపీటీసీ రవీంద్ర, సచివాలయం కార్యదర్శిలు చెంగల్రాయలు, హరిత, మనోజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శరవణ కుమార్, ఉపసర్పంచ్ రాజవేలు గ్రామస్థులు హరి, విల్వనాథ్, సుమతి తదితరులు పాల్గొన్నారు

# పాదయాత్రను ఎందుకు అడ్డుకుంటున్నారు?

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు చినబాబు



తిరుపతి, ఫిబ్రవరి 9, మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. గతంలో మా నేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న పాదయాత్ర ఎన్నడూ అడ్డుపడలేదని నేడు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్నారని అది ఓటమి భయంతో నా అని ప్రశ్నించారు. నేడు నాలుగో నియోజకవర్గంలో పాదయాత్ర సాగిస్తున్న నారా లోకేష్ అడ్డుకునేందుకు సెక్షన్ 37 కేసులు పెట్టి అడ్డుకుంటున్నారు ఎందుకని అన్నారు. 40 సంవత్సరంలో 4వేల కిలోమీటర్లు 400 రోజులు గా యువ గళం పాదయాత్రను నిర్వహిస్తున్న నారా లోకేష్ పాదయాత్రతో వైసీపీ నాయకులకు ఏ భయాందోళన కలిగించాదో రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకుని ఓటమిపాలవుతామని వైసీపీ నాయకులు పాదయాత్రను అడ్డుకుంటున్నారన్నారు.

# మరోసారి లోకేశ్‌ను అడ్డుకున్న పోలీసులు

● స్టూల్‌పైనే నిల్చుని నిరసన

గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): 'యువగళం' పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం ఆత్మకూరు నుంచి 14వ రోజు లోకేశ్ పాదయాత్ర ప్రారంభించారు. దారిపొడవునా ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. సంసిరెడ్డిపల్లెలో ప్రజలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. అక్కడి ప్రజలను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆయన నిలుచున్న స్టూల్ను లాక్కునే ప్రయత్నం చేశారు. అక్కడికి మైక్ తీసుకొస్తున్న సహాయకుడిని అడ్డుకుని దాన్ని లాక్కున్నారు. ఈ క్రమంలో పోలీసులు, తెదేపా కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మైక్ ఎందుకు లాక్కున్నారో చెప్పాలని టీడీపీ నేతలు పోలీసులపై మండిపడ్డారు. చాలా సేపు స్టూల్‌పైనే నిలుచుని నిరసన తెలిపిన లోకేశ్.. పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని చూపిస్తూ ఆయన మాట్లాడారు. ''మీలాంటి కొందరి మూలంగా పోలీస్ శాఖకే చెడ్డ పేరొస్తోంది. మాది అంబేడ్కర్ రాజ్యాంగం. మమ్మల్ని అడ్డుకోమంటున్న మీ సొంత రాజ్యాంగంతో మాకు పనిలేదు'' అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

# కేంద్ర క్యాబినెట్ మంత్రితో ఎంపీ గురుమూర్తి భేటీ



తిరుపతి, ఫిబ్రవరి 9, మనం న్యూస్: పార్లమెంట్ సమావేశాలలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నేడు ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖా మాత్యులు డా. మన్సుఖ్ మాండవీయతో వారి కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సి.జి.హెచ్.ఎస్ వెల్నెస్ సెంటర్ తిరుపతిలో ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత గూర్చి కేంద్ర మంత్రికి వివరిస్తూ తిరుపతి నుంచి సమీపంలోని సీజీహెచ్ఎస్ కేంద్రాలకు దాదాపు 200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోందని అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా చికిత్స ఖర్చు భరించలేని ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని ఆయనకి వివరించారు. వెల్నెస్ సెంటర్ ఏర్పాటుకు 6 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉండవలసిన అవసరం ఉందని కేంద్ర మంత్రి చెప్పగా ప్రస్తుతం తిరుపతి పరిసర ప్రాంతాలలో సుమారు 15 వేల మంది కేంద్ర సంస్థాగత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మరియు పదవీ విరమణ చేసినవారు ఉన్నారని వారికి సంబందించిన డేటా మొత్తం ఎంపీ గురుమూర్తి ఆయనకి అందజేశారు. సీజీహెచ్ఎస్ వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేసారని ఎంపీ గురుమూర్తి తెలియజేసారు.

### ఓటరు జాబితాకు సంబంధించి

# పెండింగ్ క్లెయిమ్స్, అభ్యంతరాలు వెంటనే క్లియర్ చేయండి






● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

రాయచోటి, ఫిబ్రవరి 9, మనం న్యూస్: ఓటరు జాబితాకు సంబంధించిన పెండింగ్ క్లెయిమ్స్, అభ్యంతరాలు వెంటనే క్లియర్ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా పోలింగ్ కేంద్రాలు, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, 6-బి ఫామ్స్, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జేసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ ఓ సత్యనారాయణ, అర్ డిఓ రంగ స్వామి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలలో పోలింగ్ స్టేషన్ల సమస్యలు లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వందశాతం ఉండేటట్లు చూడాలన్నారు. ముఖ్యంగా ఓటరు నమోదు, చిరునామా మార్పు తదితరాలకు సంబంధించిన సమస్యలు లేకుండా చూడాలన్నారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అసవరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ .ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నేడు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అధికారులందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేసి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

# పదవులు స్వీకరించిన కాంగ్రెస్ నాయకులకు ఘన సన్మానం



మదనపల్లె, ఫిబ్రవరి 9, మనం న్యూస్: రాజంపేట పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన ఇంతియాజ్,మదనపల్లి నియోజకవర్గం అధ్యక్షులు గుల్షన్ లను కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శాలువ,పూలమాలతో ఘనంగా సన్మానించారు.గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఓబిసి జాయింట్ కో-ఆర్డినేటర్ నాగూర్ వల్లి,డిసిసి ప్రెసిడెంట్ గిరీష్,మదనపల్లి పట్టణ అధ్యక్షులు రెడ్డి సాహెబ్,యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ నజీర్ అహ్మద్ తో పాటు పలువురు హాజరయ్యారు.ఈ సందర్బంగా నాగూర్ వల్లి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ను అన్నమయ్య జిల్లాలో బలోపేతం చేయడంతోపాటు,యువతతో మమేకం కావాలన్నారు.యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్,నియోజకవర్గం అధ్యక్షులు గుల్షన్లకు శుభాకాంక్షలు తెలిపారు.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ యువతకు కాంగ్రెస్ పార్టీతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.రాహుల్ గాంధీ ఆశయాల సాధనకు ముందుకు సాగాలన్నారు.ఇంతియాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే విభజన హామీలను అమలు చేయడంతోపాటు,ప్రత్యేక హోదా ఇస్తూ తొలి సంతకం చేస్తారన్నారు.అలాగే ప్రతి యేటా పది లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### 46వ భారత్-జపాన్ వ్యాపార

# సహకార కమిటీ సమావేశంలో ప్రసంగించిన శ్రీసిటీ ఎండీ

● శ్రీసిటీ సుస్థిర విధానాలపై వివరణ




శ్రీసిటీ, ఫిబ్రవరి 9, మనం న్యూస్: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసిసిఐ), జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (జెసిసిఐ) భాగస్వామ్యంతో భారత్-జపాన్ వ్యాపార సహకార కమిటీ (ఐజెబిసిసి) 46వ సంయుక్త సమావేశం గురువారం న్యూఢిల్లీలో నిర్వహించారు. 'భవిష్యత్ తరానికి సుస్థిర సమాజంపై సహకారం' ప్రధానాంశంగా సాగిన సమావేశంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొని ప్రసంగించారు. సమావేశ ప్రారంభంలో భారత్‌లోని జపాన్ రాయబారి హిరోషి సుజుకీ మాట్లాడుతూ, జపాన్ కంపెనీలకు భారతదేశం అత్యంత ప్రియమైన వ్యాపార గమ్యస్థానంగా ఆవిర్భవించిందని అన్నారు. భారతదేశం మరియు జపాన్ దేశాల మధ్య పటిష్ట వ్యాపార భాగస్వామ్య సంబంధాలు, ఆలోచనలను కూడా వివరించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సుస్థిరత జీవన నాణ్యతను బాగా మెరుగుపరుస్తుందని, సామాజిక-ఆర్థిక శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల పరిరక్షణకు దారితీస్తుందని, తద్వారా మన భవిష్యత్ తరాలకు భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. శ్రీసిటీ నిర్మాణంపై మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధి పునాదులుగా శ్రీసిటీ నిర్మించబడిందని, పర్యావరణ, సామాజిక-ఆర్థిక అంశాలలో రాజీపడకుండా ఈ ప్రాంత ఆర్థిక అవసరాలను తీర్చడానికి కృషి జరుగుతున్నట్లు తెలిపారు. 'వర్క్-లివ్-లెర్న్- ప్లే' సూత్రంపై అభివృద్ధి చేయబడిన శ్రీసిటీ పారిశ్రామిక నగరంలో స్వచ్ఛమైన గాలి, పచ్చదనం, గ్రామీణ వాతావరణంలో పట్టణ వసతులు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీలో అమలు చేస్తున్న సుస్థిర కార్యక్రమాల వీడియోను ప్రదర్శించారు. శాంతి శ్రేయస్సు పట్ల ఇరు దేశాల ఆలోచనల గురించి కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) కార్యదర్శి అనురాగ్ జైన్ వివరించారు. అలాగే రెండు దేశాల సుస్థిరత లక్ష్యాలను ప్రస్తావించారు. ఇంకా భారతదేశం, జపాన్ దేశాలకు చెందిన పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలు ఇందులో ప్రసంగించారు, ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన అనేక పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహించే జపాన్ ప్రతినిధులు ఎక్కువగా పాల్గొన్నారు. మన ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాల కోసం ప్రపంచాన్ని పరిశుభ్రంగా పచ్చగా మార్చే దిశగా భారత్-జపాన్ భాగస్వామ్యానికి రోడ్మ్యాప్ను రూపొందించే ధ్యేయంతో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు, మీడియా సభ్యులు కూడా పాల్గొన్నారు.

# కార్మికుల దుర్మరణం విచారకరం

● అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ



డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9, మనం న్యూస్: కాకినాడ జిల్లాలో ఆయిల్ కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో ఐదుగురు పాడేరు మన్య ప్రాంత కార్మికులు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు. ఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు చరవాణి ద్వారా మాట్లాడి పెద్దాపురం నియోజకవర్గ జి రంగంపేటలో జరిగిన ప్రమాదంలో పాడేరు మన్య ప్రాంతానికి సంబంధించి ఐదుగురు కార్మికులు దుర్మరణ ఘటనపై తక్షణమే తగు విచారణ చేపట్టి మృతదేహాలు వారి యొక్క స్వగ్రామలకు చేరవేయుటకు అలాగే జరిగినటువంటి దుర్ఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేకూరుట కొరకు యాజమాన్యంతో చర్చించాలని కోరినట్లు తెలిపారు. తప్పకుండా సంబంధిత కలెక్టర్ అధికారితో మాట్లాడి విచారణ వేగవంతం మృతదేహాల తరలింపు, నష్టపరిహార విషయాలు కొరకు మాట్లాడుతానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఫాల్గుణ తెలిపారు.

# మెరుగైన పనితీరు కనబర్చాలి

● ఆదాయార్జన శాఖలపై సీఎం జగన్ సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): ఆదాయార్జన శాఖలపై తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కోవిడ్ పరిస్థితులను దాటుకుని ఆదాయాలు గాడిలో పడుతున్నాయని అధికారులు అన్నారు. లక్ష్యాలకు దగ్గరగా ఆదాయాలు ఉన్నాయని అధికారులు వివరించారు. డిసెంబర్-2022 వరకూ జీఎస్టీ వసూళ్లలో దేశ సగటు 24.8 శాతం. ఏపీలో వసూళ్లు 26.2 శాతం. తెలంగాణ(17.3శాతం), తమిళనాడు(24.9 శాతం), గుజరాత్ (20.2శాతం) కన్నా మెరుగైన వసూళ్లు ఉన్నట్టుగా అధికారులు వెల్లడించారు. జీఎస్టీ వసూళ్లు 2022 జనవరి నాటికి రూ.26,360.28 కోట్లు ఉంటే, 2023 జనవరి నాటికి రూ.28,181.86 కోట్లు వసూళ్లు వచ్చాయని, గత ఏడాది ఇదే కాలపరిమితితో పోల్చుకుంటే 6.91 శాతం పెరుగుదల కనిపించిందని అధికారులు తెలిపారు. జీఎస్టీ, పెట్రోలు, ప్రొఫెషనల్ ట్యాక్స్, ఎక్సైజ్ ఆదాయాలను కలిపిచూస్తే జనవరి 2023 నాటికి ఆదాయాల లక్ష్యం రూ.46,231 కోట్లు కాగా, రూ.43,206.03 కోట్లకు చేరుకున్నామని, దాదాపు 94 శాతం లక్ష్యాన్ని సాధించినట్టుగా అధికారులు వెల్లడించారు. గతంలో సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు పన్ను వసూలు యంత్రాంగంలో కీలక మార్పులు తీసుకువచ్చామని అధికారులు తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యమైన విధానాల ద్వారా ఆదాయాలు మెరుగుపడుతున్నాయని, విధానాలను సరళీకరించుకోవడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని వెల్లడించారు. డేటా అనలిటిక్స్ వల్ల వసూళ్లు మెరుగుపడుతున్నాయన్న అధికారులు.. సిబ్బందికి శిక్షణ, వారి సమర్థతను మెరుగుపరచుకుంటున్నామని తెలిపారు. టాక్స్ అసెస్‌మెంట్‌ను ఆటోమేటిక్ పద్ధతుల్లో అందించే వ్యవస్థను నిర్మించుకున్నామని, దీనివల్ల పన్ను చెల్లింపుదారులకు మరింత సులభంగా సేవలు అందిస్తున్నామని, డివిజన్ స్థాయిలో కేంద్రీకృత రిజిస్ట్రేషన్ యూనిట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు పారదర్శకత పద్ధతులను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఏపీ కన్నా మెరుగైన పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల్లో విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్న సీఎం జగన్, తద్వారా మంచి విధానాలను రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. గనులు-ఖనిజ శాఖలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 6 వరకూ రూ.3,649 కోట్ల ఆర్జన కాగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నూటికి నూరు శాతం చేరుకున్నామని అధికారులు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి 6 నాటికి రూ.2,220 కోట్ల ఆర్జన. నిర్దేశించుకున్న రూ.5వేల కోట్ల ఆదాయ లక్ష్యాన్ని దాదాపుగా చేరుకుంటామని, ఆపరేషన్లో లేని గనులను ఆపరేషన్లోకి తీసుకొచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

రవాణా శాఖలో ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి లక్ష్యంగా రూ. 3,852.93 కోట్లు కాగా, రూ.3,657.89 కోట్లకు చేరుకున్నామని అధికారులు తెలిపారు. కోవిడ్ లాంటి పరిస్థితులు పూర్తిగా పోయి... పరిస్థితులు నెమ్మదిగా గాడిలో పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వలను విక్రయించడానికి అన్నిరకాల చర్యలు తీసుకున్నామని, మూడు దశల్లో విక్రయానికి అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నామని అధికారుల వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి(ఎక్సైజ్ శాఖ) కె నారాయణ స్వామి, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీఎస్ డాక్టర్ కే ఎస్ జవహర్రెడ్డి, అటవీపర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, గనులు భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, రవాణాశాఖ కమిషనర్ పి ఎస్ ఆర్ ఆంజనేయలు, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ ఎం గిరిజా శంకర్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, ఏపి అటవీ అభివృద్ధి సంస్థ సీజీఎం ఎం రేవతి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ రామకృష్ణ, ఏపీ స్టేట్ బివరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి వాసుదేవరెడ్డి, గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీ దాసాంజానేయ స్వామి వారి ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట

● ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు



ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్) : ఇబ్రహీంపట్నం మండలం లోని కొటికలపూడి గ్రామంలో శ్రీ మహా గణపతి, శ్రీ కుమారస్వామి సహిత శ్రీ దాసాంజానేయ స్వామి వారి ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోలాహలం నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తకమిటీ సభ్యులు శాసనసభ్యులు కృష్ణప్రసాదు ని ఘనంగా స్వాగతించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్మెంట్ ట్రైనింగ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

రాయచోటి రూరల్, ఫిబ్రవరి 09, మనం న్యూస్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థుల కోసం ప్లేస్మెంట్ ట్రైనింగ్ కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్ స్కిల్స్ అంశాల ప్రాముఖ్యత, ఆవశ్యకతపై గురువారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య రిసోర్స్ పర్సన్ గా కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ పి . కృష్ణ తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలని మరియు గమ్యాన్ని చేరడానికి అంకిత భావం ,కృషి ,పట్టుదల ధనాత్మక ఆలోచన, ఒత్తిడిని జయించడం మరియు మంచి నడవడికతో అడుగులు వేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పాత్ర ఉద్యోగ అన్వేషణలో కీలకమని, భావవ్యక్తీకరణ నైపుణ్య అభివృద్ధి తో విషయాన్ని ఎదుటివారికి క్లుప్తంగా వివరణ ఇవ్వడం, ఆత్మన్యూనతా భావాన్ని తొలగించుకుని కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటే విజయం మీ వెంటే ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూ స్కిల్స్ మరియు తరచుగా ఇంటర్వ్యూ సమయంలో ఎదురయ్యే ప్రశ్నలు మరియు వాటికి సమాధానాలు పై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వీ.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఇంజనీరింగ్ మరియు పాలిటెక్నిక్ విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్ ,అర్థమెటిక్ మరియు రీజనింగ్ అంశాలపై అందిస్తున్న ప్రత్యేక శిక్షణను కళాశాలలోని డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచుకుని ఉన్నత స్థానాలు అందుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని కళాశాలలో నిర్వహిస్తున్న ప్రతి అవగాహనా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ వివిధ విభాగాల అధిపతులు ,అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## పాఠశాలల్లో పర్యావరణ క్లబ్బులు ఏర్పాటు




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మనం బ్యూరో: నేషనల్ గ్రీన్ కారప్స్ (ఎన్జీసీ) కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్లో జిల్లాల పునర్విభజనకు మందున్న 13 జిల్లాల్లో జిల్లాకు 500 చొప్పున వివిధ పాఠశాలల్లో 6500 పర్యావరణ (ఎకో) క్లబ్బులు ఏర్పాటు చేసినట్లు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే వెల్లడించారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన మంత్రి ప్రశ్నకు రాతపూర్వకంగా జవాబిస్తూ సెంట్రల్ సెక్టార్ స్కీం ఈఈఏటీ (ఎన్విరాన్మెంట్, ఎడ్యుకేషన్, అవేర్నెస్ ట్రైనింగ్) కింద స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు పర్యావరణ సంబంధిత అంశాలు బోధించేందుకు, వాటిపై అవగాహనను విస్తృత పరిచేందుకు దేశవ్యాప్తంగా 2001 నుంచి 2022 వరకు ఒక లక్ష పర్యావరణ క్లబ్బులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పర్యావరణంపై అవగాహన కల్పించడంతోపాటు పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలైన మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ దినోత్సవాలు నిర్వహించడం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై కెపాసిటీ బిల్డింగ్ వంటి వాటిలో విద్యార్థుల భాగస్వామ్యం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఒక్కో క్లబ్కు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించిందని అన్నారు. ఈఈఏటీ స్కీంను 2022-23లో ఈఈపీ (ఎన్విరాన్మెంట్, ఎడ్యుకేషన్, ప్రోగ్రాం) పేరుతో పునరుద్ధరించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈఈపీ కింద ఇప్పటికే ఏర్పాటు చేసిన ఎకో క్లబ్ లతో పాటు యూత్ క్లబ్బులు, వివిధ ప్రభుత్వ స్కీంల కింద ఏర్పాటు చేసిన క్లబ్బులు, యూనిట్లు, గ్రూపుల సభ్యులకు పర్యావరణ అంశాలపై అవగాహన కల్పించడం, పర్యావరణం పై వర్క్ షాప్ లు, ఎగ్జిబిషన్ లు, అవగాహన సదస్సులు, కాంపిటీషన్లు నిర్వహించడం, నేచర్ క్యాంపులు, వేసవి క్యాంపులు వంటి కార్యక్రమాలు నిర్వహించి స్థిరమైన జీవన విధానాన్ని అలవర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## ఈ నెల 11న అమిత్ షా రాష్ట్ర పర్యటన



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో గెలుపే లక్ష్యంగా ఎన్నికల యాక్షన్ ప్లాన్ అమలును బీజేపీ జాతీయ నాయకత్వం షురూ చేసింది. ఈనేపథ్యంలో.. రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతలు వరుస పర్యటనలు జరపున్నారు. ఫిబ్రవరి నెలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటన ఖరారైంది. అయితే.. ఈ నెల 11న అమిత్ షా రాష్ట్ర పర్యటనకు రానుండగా, లోక్సభ ప్రవాస్ యోజన కార్యక్రమానికి హాజరుకానున్నారు. హైదరాబాద్లోని జాతీయ పోలీసు అకాడమీలో జరిగే పాసింగ్ అవుట్ పరేడ్కు అమిత్ షా హాజరుకానున్నారు. కాగా అమిత్ షా తన పర్యటనలో భాగంగా బీజేపీకి సంబంధించిన పలు కార్యక్రమాల్లో కూడా పాల్గొననున్నారు. కాగా.. ఆదిలాబాద్, పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్లు లేదా మహబూబ్నగర్, నాగర్ కర్నూలు పార్లమెంట్ స్థానాల్లో అమిత్ షా పర్యటన ఉండనుండగా.. పార్లమెంట్ స్థానాలతో సంబంధం లేకుండా ఏదైనా ఒక శక్తి కేంద్రంలోని కార్యకర్తలతో అమిత్ షా భేటీ కానున్నారు. అయితే.. సంస్థాగతంగా పార్టీ ఎంతమేరకు బలోపేతమైందనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. ఇక.. వాస్తవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా టూర్ గత నెల 28, 29వ తేదీనే ఉండాల్సి ఉంది. ఈసందర్భంగా.. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఆయన టూర్ వాయిదా వేసుకున్నారు. కాగా.. ఈ నెల 11న ఆయన తెలంగాణ పర్యటన ఖరారైంది.

### కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ల సూచన మేరకు సీఎస్ కళ్లద్దాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఈ గొప్ప కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం గొప్ప సామాజిక పథకం అన్నారు. ప్రపంచంలో ఎక్కడా కూడా ఇలాంటి పథకం అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తాత మధు, కౌశిక్ రెడ్డి కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు.

# వాస్తవ పెట్టుబడుల కోసమే మా ప్రయత్నం

### ప్రచార ఆర్భాటం, ప్రకటనలు కాదు

### నారా లోకేషే వైసీపీ స్టార్ క్యాంపెయినర్

### ఆయన ఎంత తిరిగితే మాకు అంత ప్రయోజనం

### మంత్రి గుడివాడ అమర్నాథ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: వాస్తవ పెట్టుబడుల కోసమే మా ప్రయత్నాలు.. కానీ, ప్రచార ఆర్భాటం, ప్రకటనల కోసం ప్రయత్నాలు చేయడం లేదన్నారు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. విశాఖలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్కు కేంద్ర మంత్రులను ఆహ్వానించడానికి హస్తినకు వచ్చినట్టు వెల్లడించారు. ఈ సమ్మిట్ ద్వారా 13 రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని నిర్ణయించామని తెలిపారు. సంబంధిత కేంద్ర మంత్రులను సమ్మిట్ ఆహ్వానిస్తున్నాం.. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను కూడా అందరినీ ఈ సమ్మిట్కు ఆహ్వానించామని తెలిపారు. ఇక, 3 పారిశ్రామిక వాడలు ఏపీలో ఉండడం అదృష్టంగా చెప్పుకొచ్చారు మంత్రి.. విశాఖలో జరగనున్న సమ్మిట్కు.. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రాజనాథ్ సింగ్, మాండవీయ, కిషన్ రెడ్డిలను కూడా ఆహ్వానించామని తెలిపారు.అయితేచ, ముందుగా ఒక లక్ష 87 వేల కోట్ల రూపాయలు మేరకు పెట్టుబడులు ఆకర్షించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు మంత్రి అమర్నాథ్.. వాస్తవ పెట్టుబడుల కోసమే మా ప్రయత్నాలు కానీ, ప్రచార ఆర్భాటం, ప్రకటనల కోసం ప్రయత్నాలు చేయడం లేదన్న ఆయన.. విశాఖ అనువైన ప్రదేశం కాబట్టే, పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామే కానీ, రాష్ట్ర రాజధాని వాదాన్ని బలపరుచుకోవాలనే లక్ష్యంతో పని చేయడం లేదన్నారు.. కాగా, విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఆహ్వానితుల జాబితాలో ప్రధాని నరేంద్ర మోడీ, యాపిల్ సీఈవో టిమ్ కుక్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల లాంటి ప్రముఖులు ఉన్నారు.. ఏపీ ప్రభుత్వం మార్చి 3, 4 తేదీలలో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి 15 మంది కేంద్ర మంత్రులు, 15 మంది ముఖ్యమంత్రులు, 44 మంది ప్రపంచ పారిశ్రామికవేత్తలు, 53 మంది భారతీయ పరిశ్రమల ప్రముఖులు, వివిధ దేశాల రాయబారులను ఆహ్వానిస్తున్నారు.

నారా లోకేషే వైసీపీ స్టార్ క్యాంపెయినర్..

అసలు లోకేష్ పాదయాత్రకు ప్రజలు ఎవరూ రావడం లేదు.. ఆ పాదయాత్రకు ఏమైనా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పంపాలా..? అంటూ పంచ్లు విసిరారు.. లోకేష్ యాత్రను చూసి చంద్రబాబే సైకో అయ్యారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి స్టార్ క్యాంపెయినర్ లోకేషే.. రాష్ట్రంలో నారా లోకేష్ ఎంత తిరిగితే వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి అంత ప్రయోజనం కలుగుతుందని వ్యాఖ్యానించారు మంత్రి గుడివాడ అమర్నాథ్.

# పొత్తులపై సరైన సమయంలో నిర్ణయం

### కేసీఆర్ పాలన బాగుంది..

### ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ

### బీఆర్ఎస్తో ఎంఐఎం వరుస చర్చలు

### హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంపై నజర్



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తో ఎంఐఎం పొత్తు గురించి ఆ పార్టీ చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తామో చెప్పేందుకు ఇంకా టైం ఉందని అన్నారు. ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుందని అన్నారు. కేసీఆర్ మంచి పాలన అందిస్తున్నారంటూ కితాబిచ్చారు. 17వ తేదీ మీటింగ్కు ఆహ్వానం అందలేదని.. ఇంతర పార్టీల మీటింగులకు మేం ఎందుకు వెళ్తాం అని అన్నారు. బీజేపీకి ఎంఐఎం బీ-టీమ్ అని కాంగ్రెస్ మమ్మల్ని విమర్శిస్తోందని.. బీజేపీని ఓడించాలని మేం కోరుతున్నామని అసద్ అన్నారు. కొత్త సెక్రటేరియట్ తాజ్ మహల్ను మించి ఉందని పొగిడారు. మసీద్ నిర్మాణం గురించి అడుగుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్తో పొత్తుపై భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంపై నజర్

తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ రిలీజ్ చేసింది. దీంతో తెలంగాణలో ఎన్నికల హడావుడి ప్రారంభం అయింది. తెలంగాణలో ఒక టీచర్, ఒక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కాబోతున్నాయి. ముఖ్యం హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంపై మజ్లిస్ పార్టీ నజర్ పెట్టింది. దీంతో ఈ ఎన్నికలు ఆసక్తిగా మారబోతున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఎంఐఎం పార్టీకి చెందిన సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ ఉన్నారు. మే 1తో గడువు ముగుస్తోంది. అయితే మరోసారి ఈ స్థానంలో ఎంఐఎం పాగా వేయాలని అనుకుంటోంది. దీని కోసం బీఆర్ఎస్ పార్టీ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఎంఐఎం పార్టీ ముఖ్యనేతలు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ బీఆర్ఎస్ నేతలతో వరసగా భేటీ అవుతున్నారు. ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదల కావడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవల పాతబస్తీ పర్యటన సమయంలో అక్బరుద్దీన్ ఓవైసీ, మంత్రి కేటీఆర్తో భేటీ అయ్యారు. తాజాగా అసద్ ఈ రోజు కేటీఆర్తో సమావేశం అయ్యారు. అయితే ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మద్దుతు ఇస్తుందా..? లేదా..? అనేది ఉత్కంఠగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ లో బీజేపీకి కూడా కార్పొరేటర్లు ఉండటంతో ఆ పార్టీ కూడా అభ్యర్థిని పెట్టే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతానికి బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ మద్దతు పీఆర్టీయూకా..? కమ్యూనిస్ట్ పార్టీకా..? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వాహనదారులకు నరకమే

### 10 రోజులపాటు ట్రాఫిక్ సమస్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): భాగ్యనగర ప్రజలు మళ్లీ ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొవాల్సిందే. రానున్న పది రోజులు వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు మరింతగా పెరగనున్నాయి. సమీప ప్రాంతాల్లో ముఖ్యమైన పలు ఈవెంట్ల ఫలితంగా ఆయా మార్గాల్లో ట్రాఫిక్ను మళ్లించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను మళ్లించడం వల్ల ఇరుకు రోడ్లలో చిక్కుకుపోయి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అయితే.. ఇప్పటికే గత మూడు రోజులుగా నగర ప్రజలను ట్రాఫిక్ ఆంక్షలు ఇబ్బంది పెడుతున్నాయి. కాగా.. మంగళ, బుధవారాలు ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువ అయింది. ఇక.. ఉదయం 10 నుంచి రాత్రి 11 వరకు మెయిన్ రోడ్లు, వీధులూ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. అంతేకాకుండా.. శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయి. కాబట్టి, అసెంబ్లీ మార్గంలో ఆంక్షలు ఉన్నాయి. దీనితో పాటు ఈ నెల 11న ఫార్ములా - ఈ రేసింగ్, 15 వరకు నాంపల్లిలో నుమాయిష్ ఎగ్జిబిషన్, 17న కొత్త సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉన్నాయి. ఇక రానున్న 18వ తేదీన శివరాత్రి వేడుకలు ఉంటాయి. ఈనేపథ్యంలో.. మరో 10 రోజులపాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురుకానున్నాయి. కాగా.. వాహనదారులు నరకం చూడక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే.. షిఫ్టుల వారీగా ట్రాఫిక్ పోలీసులు 24 గంటలు విధుల్లో ఉన్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. ఇదిఇలా ఉండగా.. హైదరాబాద్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై ప్రతిరోజూ సుమారు 17 వేల చలానాలు నమోదవుతుంటాయి. కాగా.. అధిక శాతం నోపార్కింగ్, రాంగ్రూట్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధరించకపోవటం, అధిక వేగం, మైనర్ల డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగ్, నంబరు ప్లేటు, లైసెన్స్ లేనివారే ఉంటున్నారు. దీంతో ప్రధాన మార్గాల్లో ఇష్టానుసారం చేరుతున్న తోపుడుబండ్లు, దుకాణాల వద్ద వాహనాలు నిలపటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వీటిని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు.

# పెద్ద ఎత్తున జన సమీకరణ

### సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా భారీ సభ

### పార్టీ నేతలతో కేటీఆర్ భేటీ

### నియోజకవర్గం నుంచి 10వేల మంది రావాలని పిలుపు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): ఈనెల 17న సచివాలయం ప్రారంభోత్సవం తర్వాత సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న సభకు భారీ జనసమీకరణ చేయాలని గ్రేటర్ నేతలకు మంత్రి కేటీ రామారావు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 10వేల మంది హాజరయ్యేలా చూడాలని నేతలకు సూచించారు. ఈనెల 13న గ్రేటర్ పరిధిలోని నియోజకవర్గాల్లో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలన్నారు. ఒక్కో నియోజకవర్గానికి ఇతర జిల్లాలకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇన్చార్జ్లుగా నియమించనున్నట్టు కేటీఆర్ తెలిపారు. ఈనెల 13 నుంచి 17వరకు ఇన్చార్జ్లు వారికి కేటాయించిన నియోజకవర్గాల్లోనే ఉండి జనసమీకరణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టినందున అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. సచివాలయం ప్రారంభోత్సవం, పరేడ్గ్రౌండ్ సభను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు తమిళనాడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రులు స్టాలిన్, హేమంత్ సోరెన్, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ తదితరనేతలు హాజరుకానున్నారు.

# అసెంబ్లీలో ధరణిపై గరం గరం

### రేవంత్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారు..

### ప్రగతిభవన్ను కూలగొడతాం అనొచ్చా?

### శ్రీధర్, భట్టన్నలు మంచోళ్లు

### ధరణిపై ఆరోపణలను కొట్టిపారేసిన కేటీఆర్

### అధికార, విపక్షాల మధ్య వాడీ వేడి చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీలో 'ధరణి'పై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. ధరణి పోర్టల్లో ఉన్న లోపాలను మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ప్రస్తావించారు. చాలా మంది రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకొని అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. మధ్యలో కలగజేసుకున్న మంత్రి కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి.. శ్రీధర్బాబు చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. ఎక్కడో ఓ చోట జరిగిన ఘటనను మొత్తం ధరణికి ఆపాదించొద్దని సూచించారు. నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని కోరారు. ఔషధ నగరికి రైతుల నుంచి తక్కువ ధరలో సేకరించిన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని శ్రీధర్బాబు ప్రస్తావించడం మరోసారి గందరగోళానికి దారితీసింది. ఎమ్మెల్యే తన మాటలను ఉపసంహరించుకోవాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

''ధరణి అమలులోకి వచ్చిన తర్వాత చాలా మందికి హక్కుపత్రం లేక ఇబ్బందిపడ్డారు. మీసేవ ద్వారా తీసుకున్న అప్లికేషన్లు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయి. ఈ రోజు మ్యూటేషన్, పార్టిషన్, పౌతీ, పేర్ల తప్పులు, డబుల్ ఖాతాలను తొలగించడం, వ్యవసాయేతర, ప్రభుత్వ భూముల గుర్తించి రికార్డులను నవీకరించి కొత్త పాస్బుక్లను మంజూరు చేశామన్న ప్రభుత్వపు మాటల్లో వాస్తవం లేదు'' అని శ్రీధర్బాబు అన్నారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్.. ''శ్రీధర్బాబు చెబుతున్న మాటలు ఎలా ఉన్నాయంటే మొత్తం వ్యవస్థంతా కకావికలం అయిపోయిందన్నట్లుగా ఉంది. అంతా బాగా ఉంటే ఎవరూ మాట్లాడరు. ఎక్కడో ఓ చోట లోపాలుంటే దాన్ని బూతద్దంలో పెట్టి.. రాష్ట్రం అంతా గందరగోళ పరిస్థితి ఏర్పడిందని.. అసలు ఏమీ జరగడంలేదని చెప్పడం సరైంది కాదు'' అని అన్నారు. శ్రీధర్బాబు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఈసందర్భంగా కేటీఆర్ మండిపడ్డారు.

శ్రీధర్, భట్టన్నలు మంచోళ్లు

ప్రగతి భవన్ను పేల్చివేయాలని రేవంత్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఇది కాంగ్రెస్ పార్టీ విధానమా? రాష్ట్ర అధ్యక్షులు అలా మాట్లాడొచ్చా? అంటూ తీవ్రంగా మండిపడ్డారు. మీ పార్టీ అధ్యక్షుడుకి, మీకు శృతి ఉందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఎవరైతే వాళ్లు ప్రగతిభవన్లో ఉంటారు అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎప్పుడూ ఇది తీసేయాలి అది పేల్చాలి తప్ప ఇంకేమైనా మంచి మాట్లాడతారా? అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి భవన్ని బద్దలు కొడతా అని అనొచ్చా? అంటూ ప్రశ్నించారు. పేల్చేయండి అనొచ్చా? అని మండిపడ్డారు. ఇదేనా కాంగ్రెస్ విధానం అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ధరణి రద్దు చేస్తా అని.. పీసీసీ చెప్తారు.

# ప్రగతిభవన్ను అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్గా మారుస్తాం

### ధరణి కుంభకోణంలో మునిగిన కేసీఆర్ కుటుంబం

### నాపై ఆరోపణలకు సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం

### పాదయాత్రను ఆపేందుకు ప్రభుత్వం కుట్రలు

### కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

### టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): అసెంబ్లీలో కేటీఆర్ విమర్శలకు రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్లో లంచ్ పాయింట్ దగ్గర టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. తనపై ఏ ఆరోపణ ఉన్నా సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమన్నారు. అలాగే ఈ ప్రభుత్వంపై తాను చేస్తున్న ఆరోపణలపై కేటీఆర్ విచారణకు సిద్ధంగా ఉండాలంటూ సవాల్ విసిరారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ఎన్నివేల ఎకరాలు ఆ జాబితా నుంచి తొలగించారు.. అవి ఎవరెవరి పేర్ల మీద బదలాయించారో బయటపెట్టాలన్నారు రేవంత్ రెడ్డి. అటవీ ప్రాంతంలో గిరిజన, ఆదివాసులకు కాంగ్రెస్ హయాం (2006)లో 10లక్షల ఎకరాల పంపిణీ చేశారు. అసైన్డ్, పోడు భూములు కలిపి దాదాపుగా 35 లక్షల ఎకరాల భూములను కాంగ్రెస్ పంచిందన్నారు. గిరిజనులను భూమి యజమానులను చేసింది కాంగ్రెస్.. భూమి అంటే తల్లితో సమానం. 69లో తెలంగాణ ఉద్యమం భూముల కోసమే జరిగింది. ఇప్పుడు కూడా భూముల కోసమే ఉద్యమాలు జరుగుతున్నాయి. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ నిజాం నుంచి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను డ్రామారావు, మిత్ర బృందం కొల్లగొట్టిందంటూ ఆరోపించారు. శాసన సభలో సభ్యుడు లేనప్పుడు పేరు ప్రస్తావించకూడదన్న జ్ఞానం కేటీఆర్కు లేదన్నారు రేవంత్ రెడ్డి. తాను సభలో ఉంటే అక్కడే సమాధానం ఇచ్చి ఉండేవాడినన్నారు. అక్రమాలు చేసే అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కటకటాల్లో వేస్తామన్నారు. అలాగే తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రగతి భవన్ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్గా మారుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ గడీల పాలనకు వ్యతిరేకం, యాత్రను అడ్డుకునేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. అందుకే యాత్రకు పోలీసు బందోబస్తు తీసేశారంటూ మండిపడ్డారు. యాత్రలో గందరగోళం సృష్టించే అవకాశం ఉందని అప్రమతంగా ఉండాల్సిందిగా కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు.

**ధరణి కుంభకోణంలో కేసీఆర్ కుటుంబం**

బీఆర్ఎస్ భూకబ్జాల ప్రభుత్వమని ధ్వజమెత్తారు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడికి 50 ఎకరాల ప్రభుత్వ భూమిని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టబెట్టారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తనకు గుంట భూమి లేదంటున్న మహబూబాబాద్ ఎంపీ కవిత మాలోత్కు మియాపూర్లో 500 ఎకరాల భూమి ఎలా వచ్చిందని రేవంత్ ప్రశ్నించారు. తనకు భూమి లేదంటున్న కవిత.. చర్చకు సిద్ధమా అని రేవంత్ సవాల్ విసిరారు. తెల్లాపూర్లోని కేటీఆర్ భూకబ్జాలు త్వరలోనే బయటపెడతానని రేవంత్ పేర్కొన్నారు. ధరణి పోర్టల్ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉందని, ధరణి పోర్టల్ అనేది పెద్ద కుంభకోణమన్నారు. ధరణి కుంభకోణంలో కేసీఆర్ కుటుంబం కూరుకుపోయిందని రేవంత్ విమర్శించారు. ప్రభుత్వ భూములను కేసీఆర్ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని ఆరోపించారు. తాను భూకబ్జాలు చేసి ఉంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండని రేవంత్ ఛాలెంజ్ చేశారు.

# తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలిన ఆసీస్

**• 177 పరుగులకు ఆలౌట్ • అదరగొట్టిన భారత బౌలర్లు • మొదటి రోజు భారత్ స్కోరు 77/1**



నాగ్‌పూర్: బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలి యాతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆట ముగిసింది. టాస్ నెగ్గిన ఆసీస్ బ్యాటింగ్ ఎంచుకొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ తన తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలింది. అనంతరం మొదటి రోజు ఆట ముగిసేసమయానికి టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (56) దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టుల్లో అర్ధశతకం బాదాడు. తొలి రోజు మరో ఏడు బంతుల్లో ముగుస్తుందనగా.. కేఎల్ రాహుల్ (20) మర్ఫీ బౌలింగ్‌లో కాట్ అండ్ బౌల్ అయ్యాడు. దీంతో 76 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజ్‌లో రోహిత్‌తో పాటు నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన రవిచంద్రన్ అశ్విన్ ఉన్నాడు.

**జడ్డూ మాయ.. అశ్విన్ అనుభవం**

నాగ్‌పూర్ పిచ్ స్పిన్‌కు అనుకూలమని అంతా అంచనా వేశారు. కానీ, అనూహ్యంగా భారత పేసర్లు షమీ (1/18), సిరాజ్ (1/30) ఆరంభంలోనే ఆసీస్ ఓపెనర్లు ఖవాజా (1), డేవిడ్ వార్నర్ (1)ను ఔట్ చేసి టీమ్‌ఇండియాకు బ్రేక్ ఇచ్చారు. ఆ తర్వాత స్పిన్నర్లను రంగంలోకి దింపిన కెప్టెన్ రోహిత్ ఫలితం రాబట్టాడు. లబుషేన్ (49: 123 బంతుల్లో), స్టీవ్ స్మిత్ (37: 107 బంతుల్లో) కాసేపు అడ్డుపడినా.. భారత బౌలర్ల దెబ్బకు ఆసీస్ 200లోపే కుప్పకూలింది. ఈ క్రమంలో రవీంద్ర జడేజా (5/47) ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. అశ్విన్ (3/42) దెబ్బకు ఆసీస్ హడలెత్తిపోయింది.

**రెండో రోజు నిలబడితే చాలు..**

కాస్త ఓపికగా క్రీజ్‌లో నిలబడటంతో పాటు అవసరమైన సందర్భంలో దూకుడు ప్రదర్శిస్తే మాత్రం పరుగులు చేయడం పెద్ద కష్టమేమీ కాదని ఇప్పటికే లబుషేన్, స్టీవ్ స్మిత్, అలెక్స్ క్యారీతో పాటు భారత కెప్టెన్ రోహిత్ శర్మ నిరూపించారు. ఇంకా మరో 100 పరుగులు మాత్రమే వెనుకబడి ఉన్న టీమ్‌ఇండియా రెండో రోజు మొత్తం బ్యాటింగ్ చేస్తే తొలి టెస్టులో పై చేయి సాధించడం కష్టమేం కాదు. ఆసీస్‌పై కనీసం 200 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధిస్తే మాత్రం భారత్ విజయాన్ని ఆపడం ఎవరి తరమూ కాకపోవచ్చు. తొలి రోజే స్పిన్‌కు అనుకూలంగా మారిన నాగ్‌పూర్ పిచ్.. గడిచే కొద్దీ స్పిన్నర్ల పాలిట స్వర్గధామంగా మారుతుండడంలో సందేహం లేదు. ఇప్పుడు క్రీజ్‌లో ఉన్నవారే కాకుండా విరాట్, ఛెతేశ్వర్ పుజారా, సూర్యకుమార్, రవీంద్ర జడేజా, భరత్, అక్షర్ బ్యాటింగ్ చేయాల్సి ఉంది.

## రాకెట్ స్పీడ్‌తో ఇక్కడికి చేరుకోలేదు

**ద్రవిడ్ ప్రభావం చాలా ఉంది**

**తెలుగు కుర్రాడు కేఎస్ భరత్**



న్యూఢిల్లీ: మరో తెలుగు కుర్రాడు టెస్టుల్లోకి అరంగేట్రం చేశాడు. గతంలో మహమ్మద్ అజారుద్దీన్, వెంకటపతిరాజు, వీవీఎస్ లక్ష్మణ్, ఎంఎస్‌కే ప్రసాద్.. సిరాజ్ వీరంతా తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ తరపున టెస్టు క్రికెట్‌లో అడుగుపెట్టారు. ఇప్పుడు చాలా రోజుల తర్వాత వైజాగ్‌కు చెందిన తెలుగు కుర్రాడికి అవకాశం దక్కింది. అతడే కోన శ్రీకర్ భరత్.. కేఎస్ భరత్‌గా ఆస్ట్రేలి యాతో తొలి టెస్టులోకి అడుగుపెట్టాడు. అతడి జెర్సీ నంబర్:14. టాప్ బ్యాటర్ ఛెతేశ్వర్ పుజారా చేతుల మీదు గా క్యాప్‌ను అందుకొన్నాడు. అరంగేట్రం చేసిన సందర్భంగా భరత్ తన మనసులోని మాటలను పంచుకొన్నాడు. ఈ వీడియోను బీసీసీఐ తన వెబ్‌సైట్‌లో పోస్టు చేసింది. ''ఎదురుచూపులకు ఫలితం దక్కింది. భారత్ తరపున ఆడటం చాలా ఆనందంగా ఉంది. ఇది కేవలం నా కల మాత్రమే కాదు. నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు. నాలుగైదేళ్ల మంచి ప్రదర్శన ఇవ్వడంతో ఇప్పుడు అవకాశం రావడం మాత్రం సంతోషంగా ఉంది''

**అలా మెరుగుపర్చుకుంటూ..**

''నా జీవితం ఏమీ రాకెట్ వేగంతో దూసుకురాలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ రావడం జరిగింది. ఇదే నా కెరీర్‌పై పెను ప్రభావం చూపింది. సానుకూల దృక్పథంతో ఆడుతూ వస్తున్నా'' అని శ్రీకర్ వెల్లడించాడు. 2012లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన భరత్.. 2015లో ఐపీఎల్‌లోకి అడుగు పెట్టాడు. ఇప్పటి వరకు 79 ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మ్యాచుల్లో 308 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరుతో 4,289 పరుగులు చేశాడు. వీటిలో 9 శతకాలు, 23 అర్ధశతకాలు ఉన్నాయి.

## నాగ్‌పూర్ పిచ్ ఏం చెబుతోంది?



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా జట్టు భయపడి నంతా జరిగింది. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆ జట్టు బ్యాటర్ల లో అత్యధికులు కుదురుకోకముందే పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో పిచ్ గురించి వాళ్లు ఇన్నాళ్లుగా వ్యక్తం చేసిన భయం నిజమే అని తేలింది. దీంతో తొలి టెస్టులో ఆసీస్‌కు కష్ట కాలం మొదలైంది. రఫ్‌గా ఉన్న ఈ పిచ్‌పై పగుళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా పచ్చిక స్పష్టంగా ఉండటంతో పగుళ్లు చెదరకుండా ఉంటాయని.. దీంతో ఇది లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లకు నరకం చూపిస్తుందంటూ క్రికెట్ వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ చెప్పిన మాటలు నిజమయ్యాయి. ఉస్మాన్ ఖవాజా, డేవిడ్ వార్నర్ వంటి స్టార్ బ్యాటర్లు కూడా పిచ్‌పై బంతిని అంచనా వేయడంలో బోల్తా పడ్డారు. వీరిద్దరూ లెఫ్ట్‌హ్యాం డర్లే.ఈ పిచ్‌పై నిలదొక్కుకుని సహనంగా ఆడి.. లయ తప్పిన బంతులను బౌండరీలు దాటిస్తే.. పరుగులు చేయడం కష్టమేమీ కాదని అర్థమవుతోంది. కీపర్ అలెక్స్ క్యారీ దూకుడుగా ఆడి ఏడు ఫోర్ల సాయంతో 33 బంతుల్లో 36 పరుగులు సాధించాడు.

**నిలదొక్కుకోనివ్వని పిచ్**

ఈ పిచ్‌పై మొత్తం 11 మంది ఆసీస్ బ్యాటర్లలో ఆరుగురు కలిసి కేవలం 9 పరుగులు మాత్రమే చేశారంటే అర్థం చేసుకోవచ్చు. వీరిలో ఇద్దరు డకౌట్లు కాగా.. ముగ్గురు బ్యాటర్లు తలో పరుగు చేశారు. పిచ్ బ్యాటర్‌కు నిలదొక్కుకునే సమయం కూడా ఇవ్వడం లేదనే దీనర్థం. ఇది భారత బ్యాటర్లకు ఓ హెచ్చరిక. భారత కెప్టెన్ కూడా ఎప్పుడెప్పుడు స్పిన్నర్లను రంగంలోకి దింపుదామా అని ఎదురు చూశాడు. అయితే క్రీజులో నిలదొక్కుకుని స్ట్రోక్ ప్లే ఆడినవాళ్లకు, బ్యాక్‌ఫుట్ మీద షాట్లు అలవాటు ఉన్నవాళ్లకు ఈ పిచ్ నుంచి మంచి సహకారమే వస్తోంది. దీనికి ఉదాహరణ లబుషేన్, స్మిత్ ఆటతీరు, పరుగులే నిదర్శనం.

## టెస్టుల్లోకి అరంగేట్రం..

**ఒకరు నాలుగేళ్లుగా జట్టుతోనే.. మరొకరు టీ20ల్లో నంబర్ వన్**



న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా తరపు న ఇద్దరు ఆటగాళ్లు టెస్టుల్లోకి అరంగేట్రం చేశారు. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ – ఆసీస్ తొలి టెస్టు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇద్దరిలో ఇప్పటికే వన్డేలు, టీ20ల్లో టాప్ బ్యాటర్‌గా ఎదిగిన సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు. గతేడాది నుంచి సూర్యకుమార్ పొట్టి ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్నాడు. దీంతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. ఇప్పటి వరకు 20 వన్డేలు, 48 టీ20లను ఆడాడు. గతంలోనూ టెస్టు స్క్వాడ్‌లోకి ఎంపికైనప్పటికీ.. తుది జట్టులో మాత్రం స్థానం దక్కలేదు. ఈ సారి మిడిల్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడే రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదం కారణంగా దూరం కావడంతో సూర్యకు అవకాశం దక్కింది. క్లిష్టపరిస్థితుల్లో దూకుడుగా ఆడి జట్టుకు అండగా నిలుస్తాడని మేనేజ్‌మెంట్ నమ్మకం పెట్టుకొంది. మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి చేతుల మీదుగా సూర్యకుమార్ (జెర్సీ–63) తన టెస్టు క్యాప్‌ను అందుకొన్నాడు. తెలు గు కుర్రాడు.. ఇండియా – ఏ తరపున ఆడిన ఆంధ్రప్రదేశ్ ఆటగాడు కోన శ్రీకర్ భరత్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అదరగొట్టాడు. కేవలం 79 మ్యాచుల్లోనే 4,289 పరుగులు సాధించాడు. 2019లోనే బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికైనప్పటికీ తుది జట్టులో అవకాశం రాలేదు. అలాగే రెండేళ్ల కిందట (2021) ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన స్టాండ్‌బై ఆటగాళ్లలో కేఎస్ భరత్ కూడా ఉన్నాడు. గత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కివీస్‌తో తలపడినప్పుడు భరత్ సబ్‌స్టిట్యూట్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. సాహా గాయపడటంతో అతడి స్థానంలో వచ్చిన శ్రీకర్ రెండు క్యాచ్‌లు, ఒక స్టంపౌట్ చేశాడు. ఇప్పుడు పూర్తిస్థాయిలో టెస్టు క్రికెట్ అరంగేట్రం చేయడం విశేషం. ఛెతేశ్వర్ పుజారా చేతుల మీదుగా తన టెస్టు క్యాప్‌ను భరత్ (జెర్సీ – 14) అందుకొన్నాడు. బంగ్లాదేశ్, శ్రీలంక, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లకు స్క్వాడ్‌లో ఉన్నా తుది జట్టులో మాత్రం స్థానం దక్కిం చుకోలేదు. ఎట్టకేలకు ఆసీస్‌తో ప్రతిష్ఠాత్మకమైన బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో చోటు సంపాదించాడు.

## కుంబ్లే రికార్డు బ్రేక్ చేసిన అశ్విన్

**ఖాతాలో అరుదైన మైలురాయి**



న్యూఢిల్లీ: టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అరుదైన రికార్డు సృష్టించాడు. టెస్టుల్లో 450 వికెట్లు మైలురాయిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలోనే అత్యంత వేగంగా ఈ మైల్ స్టోన్ అందుకున్న ఇండియన్ స్పిన్నర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అనిల్ కుంబ్లే రికార్డును అతడు బ్రేక్ చేశాడు. అశ్విన్ తన 89వ టెస్టులో ఈ ఘనత సాధించడం విశేషం. ఇక టెస్టుల్లో ఈ ఘనత సాధించిన రెండో ఇండియన్ బౌలర్ కాగా.. ఓవరాల్‌గా 9వ ప్లేయర్. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే.. టెస్టుల్లో అత్యంత వేగంగా 450 వికెట్లు తీసిన బౌలర్లలో అశ్విన్‌ది రెండోస్థానం. అతని కంటే ముందు శ్రీలంక లెజెండరీ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ ఉన్నాడు. ఈ శ్రీలంక మాజీ స్పిన్నర్ తన 80వ టెస్టు మ్యాచ్లోనే 450 వికెట్లు మైలురాయిని అందుకోవడం విశేషం. ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో అలెక్స్ కారే వికెట్ తీయడం ద్వారా అశ్విన్ ఈ ఘనత సాధించాడు. అయితే ఈ మ్యాచ్‌లో వేసిన తొలి 10 ఓవర్లలో అతనికి వికెట్ దక్కలేదు. 11వ ఓవర్లో కారేను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ పిచ్ తొలి రోజు నుంచే స్పిన్నర్లకు అనుకూలించడంతో జడేజాతో కలిసి అశ్విన్ చెలరేగాడు. అంతకుముందు తొలి రోజు ఉదయమే ఇండియన్ పేసర్లు సిరాజ్, షమీ ఆస్ట్రేలియాను దెబ్బతీశారు. సిరాజ్ తాను వేసిన తొలి బంతికే ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో షమీ వేసిన బాల్.. వార్నర్ ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. దీంతో ఆసీస్ 2 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. అయితే ఈ దశలో స్మిత్, లబుషేన్ మూడో వికెట్‌కు 82 పరుగులు జోడించి ఆదుకున్నారు. కానీ మిగతా ప్లేయర్లు విఫలమవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 177 రన్స్‌కు ఆలౌటైంది.

## సూర్యకుమార్ అరుదైన రికార్డు

**తొలి భారత క్రికెటర్‌గా గుర్తింపు**



న్యూఢిల్లీ: సూర్యకుమార్ యాదవ్.. టీమిం డియా ఫ్యూచర్ స్టార్‌గా ఎదుగుతున్నాడు. టీ20, వన్డేల్లో ఇప్పటికే తానేంటో నిరూపిం చుకుని ప్రపంచంలోనే నెంబర్ వన్ బ్యాట ర్‌గా కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే టెస్టు అరంగేట్రం కూడా చేసేశాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా నాగ్‌పూర్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతోన్న తొలి టెస్టులో సూర్యకుమార్‌కు భారత తుది జట్టులో చోటు దక్కింది. దీంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయాలన్న సూర్య కల నేరవేరింది. ఈ క్రమంలోనే ఇతడు ఓ అరుదైన రికార్డు సాధించాడు.30 ఏళ్ల వయసు తర్వాత అన్ని ఫార్మాట్లలో అరంగేట్రం చేసిన తొలి భారత క్రికెటర్‌గా సూర్యకుమార్ రికార్డులకెక్కాడు. మరోవైపు ఆంధ్ర ఆటగాడు శ్రీకర్ భరత్ కూడా ఈ మ్యాచ్‌తోనే టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

## రాజ్యసభ సమావేశాలను నిర్వహించిన పీటీ ఉష



న్యూఢిల్లీ: పెద్దల సభలో అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది. ప్రముఖ అథ్లెట్ పీటీ ఉష గురువారం ఛైర్మన్ కుర్చీలో కూర్చొని.. రాజ్యసభ కార్యకలాపాలను పర్యవేక్షించారు. దీనికి సంబంధించిన వీడియోను ఉష ట్విటర్‌లో షేర్ చేసి.. తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.'ఫ్రాంక్లిన్ డి.రూజ్వెల్ట్ చెప్పిన విధంగా.. గొప్ప స్థానం ఇంకా గొప్ప బాధ్యతను కలిగి ఉంటుంది. 'పయ్యోలి ఎక్స్‌ప్రెస్'గా పేరొందిన ఆమె.. ఆసియా గేమ్స్‌లో పలుమార్లు స్వర్ణ పతకం సాధించారు. 1984 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో నాలుగో స్థానంలో నిలిచారు. భారత ఒలింపిక్ సంఘంతొలి మహిళా ప్రెసిడెంట్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు.

## భోళా శంకర్‌లో ఈ సాంగ్ అద్దిరిపోద్దట.!




మెగాస్టార్ చిరంజీవి హీరోగా ప్రస్తుతం దర్శకుడు మెహర్ రమేష్ తో భోళా శంకర్ అనే మాస్ ఎంటర్టైనర్ చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. దీనిపై భారీ అంచనాలు నెలకొనగా ఈ సినిమా నుంచి మేకర్స్ నిన్ననే ఇంట్రెస్టింగ్ అప్డేట్ కూడా అందించారు. ప్రస్తుతం సినిమాలో ఓ సూపర్ మాస్ నెంబర్ సాంగ్ షూటింగ్ చేస్తుండగా ఈ సాంగ్ విషయంలో మాత్రం మేకర్స్ మంచి కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఇక సోషల్ మీడియాలో కూడా తాజాగా హీరోల డాన్స్ లు సాంగ్స్ పై టాపిక్స్ నడుస్తూ ఉండగా దర్శకుడు మెహర్ అయితే సాలిడ్ రిప్లై అందించారు. ప్రతి ఒకరికి భోళా శంకర్ నుంచి బాస్ తో అయితే అందరికీ సమాధానం దొరుకుతుంది జస్ట్ వెయిట్ అన్నట్టుగా స్పందించారు. దీనితో భోళా శంకర్ లో ఇప్పుడు తెరకెక్కిస్తున్న సాంగ్ పై మరింత హైప్ ఎక్కుతుంది అని చెప్పాలి. ఇక ఈ సాంగ్ ని శేఖర్ మాస్టర్ డాన్స్ కంపోజ్ చేస్తుండగా మహతి సాగర్ సంగీతం అందించాడు.

## రావణాసురకి డబ్బింగ్ షురూ చేసిన సుశాంత్!



మాస్ మహారాజా రవితేజ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ రావణాసుర. ఈ చిత్రం లో టాలీవుడ్ యంగ్ యాక్టర్ సుశాంత్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం కి సంబంధించిన ఒక అప్డేట్ ను సుశాంత్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించడం జరిగింది. ఈ చిత్రం కి డబ్బింగ్ ను షురూ చేసినట్లు తెలిపారు. తన పాత్రకి సంబంధించిన ఒక ఆసక్తికర ఫోటో ను షేర్ చేశారు. తన బ్యాక్ సైడ్ కనపడేలా ఈ ఫోటో ఉంది. ఇప్పటికే ఈ చిత్రం నుండి విడుదల అయిన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ఇటీవల విడుదలైన రావణాసుర అంతెం కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఏప్రిల్ 7, 2023 న రిలీజ్ కి రెడీ అవుతున్న ఈ చిత్రం లో అను ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ లు లేడీ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## టాప్‌లో ట్రెండ్ అవుతోన్న సార్ ట్రైలర్!




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం లో తెరకెక్కిన బహుభాషా చిత్రం సార్. తమిళం లో వాతి పేరిట రిలీజ్ కానుంది. ఈ చిత్రం కి సంబంధించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిన్న హైదరాబాద్ లోని ఏఎంబీ సినిమాస్ లో గ్రాండ్ గా జరిగింది. అయితే రిలీజైన ట్రైలర్ కి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ట్రైలర్ యూ ట్యూబ్ లో టాప్ లో ట్రెండ్ అవుతోంది. సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో హైపర్ ఆది, తనికెళ్ళ భరణి, సాయి కుమార్, సముద్ర ఖని తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పై నాగ వంశీ, సాయి సౌజన్య లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఫిబ్రవరి 17 న వరల్ వైడ్ గా థియేటర్ల లో విడుదల కాబోతున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

మనం మూవీ

## విజయ్ లియోలో చరణ్ కూడా?



ప్రస్తుతం మావెరిక్ దర్శకుడు శంకర్ తో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఓ భారీ పాన్ ఇండియా సినిమా చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమాపై అటు తమిళ్ లో కూడా భారీ అంచనాలు నెలకొనగా మరో పక్క తమిళ్ నుంచి రీసెంట్ గా అనౌన్స్ అయ్యి తెలుగు ఆడియెన్స్ లో కూడా భారీ హైప్ రేపిన సినిమా లియో. ఇళయ దళపతి విజయ్ హీరోగా దర్శకుడు లోకేష్ కనగ రాజ్ తో అనౌన్స్ చేసిన ఈ సినిమా మోస్ట్ అవైటెడ్ గా ఉండి ఫైనల్ గా ఆ అంచనాలు నిలబెడుతూ అనౌన్స్ అయ్యింది. అయితే ఇప్పుడు ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో రామ్ చరణ్ ఉన్నాడు అంటూ పలు అంశాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. లియో నుంచి అనౌన్స్ చేసిన ఫస్ట్ టీజర్ లో తెలంగాణ కి చెందిన కార్ విజువల్ కనిపించడం ఆసక్తిగా మారింది. దీనితో ఇది చరణ్ రోల్ కి ఏమన్నా లింక్ ఉందని రూమర్స్ మొదలయ్యాయి. మరి చరణ్ అయితే ఈ సినిమాలో ఉన్నాడో లేదో కాలమే నిర్ణయించాలి.

## బింబిసార 2పై ఓపెన్ అయ్యిన కళ్యాణ్ రామ్!



ప్రస్తుతం రిలీజ్‌కి సిద్ధంగా ఉన్న టాలీవుడ్ చిత్రాల్లో నందమూరి యంగ్ హీరో నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం అమిగోస్ కూడా ఒకటి. దీనిపై మంచి అంచనాలు ఉండగా కళ్యాణ్ రామ్ నటించిన లాస్ట్ హిట్ బింబిసార తర్వాత వస్తున్న సినిమా ఇది కావడంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. అయితే కళ్యాణ్ రామ్ కెరీర్ లో బింబిసార సినిమా భారీ హిట్ కాగా దీనికి సీక్వెల్ కూడా మేకర్స్ అనౌన్స్ చేశారు. అయితే ఈ సినిమా ఎప్పుడు మొదలు అవుతుంది అనేది మాత్రం లేటెస్ట్ గా కళ్యాణ్ రామ్ అయితే రివీల్ చేశారు. తన అమిగోస్ ప్రమోషన్స్ లో మాట్లాడుతూ ఈ చిత్రాన్ని అయితే తాను ఈ ఏడాది చివరలో తాము స్టార్ట్ చేయనున్నట్టుగా కన్ఫర్మ్ చేసాడు. దీనితో ఈ చిత్రం పై ఆడియెన్స్ కి కావాల్సిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ అయితే తన నుంచి బయటకి వచ్చింది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి వశిష్ట దర్శకత్వం వహించగా ఎం ఎం కీరవాణి సంగీతం అందించారు.

## అజిత్ సినిమాకి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్?



తమిళ్ స్టార్ హీరో అజిత్ నటించిన లేటెస్ట్ చిత్రం తునివు తో తన కెరీర్ లో మరో సూపర్ హిట్ ని తాను సొంతం చేసుకోగా ఇక నెక్స్ట్ తన కెరీర్ 62వ సినిమాపై మరింత సాలిడ్ హైప్ నెలకొంది. అయితే ఈ సినిమా పట్ల ఆసక్తికర వాతావరణం నెలకొంది. మొదటగా ఓ దర్శకుణ్ణి అనుకోవడం తర్వాత అతన్ని తప్పించడం ఇక నెక్స్ట్ మరో దర్శకుడు అంటూ క్లారిటీ లేకుండా పోయింది. కానీ ఈ చిత్రానికి అయితే అజిత్ తో వర్క్ చేయడానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ లాక్ అయ్యినట్టుగా తెలుస్తుంది. తమిళ్ లో ఎన్నో సాలిడ్ ఆల్బమ్స్ అందించిన అండర్ రేటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారాయణన్ ఈ సినిమాకి వర్క్ చేయనున్నట్టుగా తెలుస్తుంది. తమిళ్ లో కబాలి, కాలా, కాష్మోరా, తెలుగులో లేటెస్ట్‌గా నాని దసరా సినిమా సహా ఎన్నో చిత్రాలకి ఐకానిక్ మ్యూజిక్ తాను అందించాడు. మరి అజిత్‌తో తనకిది ఫస్ట్ సినిమా అన్నట్టు కూడా తెలుస్తుంది. మరి దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidu pet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.